RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక




హైదరాబాద్ | సోమవారం 19-10-2026 | సంచిక: 13 | సంఖ్య: 361 పేజీలు: 8 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి



## నితీశ్‌పై పీకే అనూహ్య ప్రశంసలు..

**బీహార్ టాప్-10 నేతల్లో ఒకరంటూ కితాబు**

**నితీశ్ ఆరోగ్యంగా ఉన్నప్పుడు రాష్ట్రం కోసం చిత్తశుద్ధితో పనిచేశారన్న ప్రశంస**

**వైశాలి పడవ ప్రమాద బాధితులతో దసరా జరుపుకుంటానని ప్రకటన**

**కులం, మతం పక్కన పెట్టి ఓటెయ్యాలని ప్రజలకు పిలుపు**

జన సురాజ్ పార్టీ అధినేత, ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే), బీహార్ మాజీ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌పై అనూహ్యంగా ప్రశంసల వర్షం కురిపించారు. బీహార్ చరిత్రలోనే అత్యంత సమర్థవంతమైన, సమాజం పట్ల శ్రద్ధ ఉన్న పది మంది ఉత్తమ నేతల్లో నితీశ్ ఒకరని అభివర్ణించారు. వైశాలిలో బీహార్ శాసనమండలి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నితీశ్ కుమార్ గురించి పీకే మాట్లాడుతూ, "ఆయన ఆరోగ్యంగా, చురుకుగా ఉన్నప్పుడు రాష్ట్ర అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేశారు. అయితే, ఆయన అనారోగ్యంతో ఉన్న సమయంలో ఇతరులు ఆయన పేరుతో ప్రభుత్వాన్ని నడిపారు.

2లో



## ఎల్‌నినోతో రాష్ట్రంలో కరవు పరిస్థితులు: పొన్నం ప్రభాకర్

**వర్షాభావ పరిస్థితులపై మంత్రి ఆందోళన**

**సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొని ప్రజలకు శుభాకాంక్షలు**

**తోటపల్లి--గాంధీనగర్ ఘాట్ వద్ద హైమాస్ట్ లైట్లు ప్రారంభం**

**హుస్నాబాద్, అక్టోబర్ 18 (నేటి ప్రస్థానం):** తెలంగాణలో రైతాంగానికి వర్షాలే కీలకమని, సమృద్ధిగా వానలు కురిసినప్పుడే వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర కరవు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇప్పటికే కరవు పరిస్థితులు కనిపిస్తున్నాయని, ఈ నేపథ్యంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం ఎల్లమ్మ చెరువు కట్ట వద్ద ఆదివారం నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు పెద్ద బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## ఏపీలో ముగిసిన నామినేషన్ల ఘట్టం!

**28న పోలింగ్.. 30న ఫలితాలు**

రాష్ట్రవ్యాప్తంగా నామినేషన్ల దాఖలుకు తెర

**దర్శిలో 25 మంది వైసీపీ అభ్యర్థులకు చేదు అనుభవం**

**19న పత్రాల పరిశీలన.. 21న ఉపసంహరణల గడువు ముగింపు**




2లో

## ముస్సిపల్ ఎన్నికలు నామినేషన్ల గడువుపై వైసీపీకి హైకోర్టులో చుక్కెదురు

**గడువు పెంపునకు నో..**

వైసీపీ పిటిషన్‌పై హైకోర్టు నిర్ణయం

నామినేషన్ల సమయం ముగిసిందని పిటిషన్‌ను తిరస్కరించిన న్యాయస్థానం

పుంగనూరు ఘర్షణల నేపథ్యంలో 70 మందిపై పోలీసు కేసులు

పట్టణంలోకి రావద్దంటూ పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డికి నోటీసులు








## ఎంవీఎస్ఆర్ ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించండి

**ఎంవీఎస్ఆర్ ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందన**

**ఆర్చ్ కూలి విద్యార్థిని మృతి.. 14 మందికి గాయాలు**

**ఈవెంట్ నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

హైదరాబాద్, అక్టోబర్ 18 (నేటి ప్రస్థానం): నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఘటనలో గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఆయన సూచనల మేరకు క్షతగాత్రులను యశోద ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కళాశాలలో నిర్వహించిన దాండియా వేడుకల సందర్భంగా

2లో



## రూ.4.5 లక్షలు చెల్లించినా ఉద్యోగాలు రాలేదు..

**టోమ్‌కామ్‌పై హరీశ్‌రావు ఆగ్రహం**

జర్మనీలో కొలువుల ఆశ చూపి యువత నుంచి భారీగా డబ్బులు వసూలు చేశారని ఆరోపణ

రెండేళ్లుగా ఎదురుచూస్తున్న 70 మందికి పైగా నిరుద్యోగులు

బాధితులకు నగదు తిరిగి ఇచ్చి, సీఐడీ విచారణ చేపట్టాలని బీఆర్ఎస్ డిమాండ్



2లో



## ఎన్హెచ్ఎం ఉద్యోగుల జీతాల్లో కోత..

జీతాలు తగ్గిస్తూ ఇచ్చిన జీవో 1195ను రద్దు చేయాలని కవిత డిమాండ్

కొందరి ఉద్యోగులకు రూ.4,000 నుంచి రూ.5,000 వరకు జీతాలు తగ్గాయని ఆరోపణ

సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున

2లో

## ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. గవర్నర్‌ను కలిసిన జగన్



**స్థానిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార పక్షం అక్రమాలకు పాల్పడుతోందని ఫిర్యాదు**

**ఎన్నికల ప్రక్రియకు కేంద్ర బలగాల పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి**

**ఓటమి భయంతోనే చంద్రబాబు దాడులు చేయిస్తున్నారని ఆరోపణ**

**ప్రజాస్వామ్య పరిరక్షణకు న్యాయపరమైన పోరాటం చేస్తామని స్పష్టీకరణ**

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను కోరారు. ఆదివారం ఆయన రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# ప్రజాస్వామ్యాన్ని కాపాడండి..

భేటీ అయ్యారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార కూటమి అప్రజాస్వామిక పద్ధతులకు పాల్పడుతోందని, ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. సమావేశం అనంతరం జగన్ మీడియాలో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంతటి అప్రజాస్వామిక వాతావరణాన్ని తానెప్పుడూ చూడలేదని అన్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం కేంద్ర బలగాల పర్యవేక్షణలో, సీసీటీవీ కెమెరాల నిఘాలో జరిపేలా చూడాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. వైసీపీ అభ్యర్థులను నామినేషన్ కేంద్రాల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని, అదే సమయంలో టీడీపీ మద్దతుదారులను లోపలికి అనుమతించి దాడులు చేయిస్తున్నారని గవర్నర్‌కు వివరించినట్లు చెప్పారు. ఈ అరాచకాలకు పోలీసులు కూడా అధికారపక్షానికే మద్దతుగా నిలుస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని 8 ప్రాంతాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని, మరో 19 చోట్ల కేవలం 36 శాతం నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకో 8 ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను చించివేశారని తెలిపారు. పులివెందులలో 36 వార్డులకు గాను కేవలం 19 నామినేషన్లు మాత్రమే దాఖలు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద వైసీపీ ఎంపీలు అవినాశ్ రెడ్డి, మిథున్ రెడ్డి, గురుమూర్తి పట్ల వ్యవహరించిన తీరు, అభ్యర్థులపై పోలీసుల కాల్పులు, తప్పుడు కేసులు బనాయించడం వంటి అంశాలను కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. క్రియాశీలకంగా ఉన్న వైసీపీ కార్యకర్తలను భయపెట్టేందుకు బైండోవర్ కేసుల కుట్ర జరుగుతోందని జగన్ ఆరోపించారు. "ఓటమి భయంతోనే చంద్రబాబు ఇలాంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్నారు. పోటీ చేయాలనుకునేవారికి అవకాశం ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ. దీనిపై న్యాయపరమైన మార్గాలతో సహా అన్ని అవకాశాలను అన్వేషిస్తాం" అని స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులు ధైర్యంగా పోరాడాలని, త్వరలోనే పరిస్థితులు మారతాయని ఆయన పిలుపునిచ్చారు.

**ఈసీల నియామకంపై తప్పుచేశాం: పశ్చాత్తాపం వ్యక్తం చేసిన జగన్**

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ), ఇతర కమిషనర్ల నియామకం కోసం కేంద్ర ప్రభుత్వం 2023లో తీసుకొచ్చిన చట్టానికి అప్పట్లో మద్దతివ్వడం తాము చేసిన పెద్ద తప్పిదమని, అందుకు ఇప్పుడు చింతిస్తున్నామని జగన్ విచారం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న పార్టీయే ఎన్నికల కమిషనర్లను నియమించే ప్రక్రియను నియంత్రించకూడదని, ఈ విధానంపై ఇప్పుడు పశ్చాత్తాపం చెందుతున్నామని ఆయన అన్నారు. అంతకుముందు ఎస్ఈసీ అనిల్ పునేఠాను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ జగన్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో అయినా, రాష్ట్రంలో అయినా ఎన్నికల కమిషనర్లను అధికార పార్టీ నామినేట్ చేయకూడదని జగన్ స్పష్టం చేశారు. "గతంలో కేంద్రంలో అధికార పార్టీయే ఎన్నికల కమిషనర్‌ను నామినేట్ చేసే విధానానికి వైసీపీ మద్దతు ఇచ్చింది. కానీ ఆ రోజు మేము చేసిన తప్పుకు ఇప్పుడు బాధపడుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు. "పరీక్ష రాసే విద్యార్థే తనకు ఇన్విజిలేటర్‌ను నియమించుకున్నట్లుగా ఈ విధానం ఉంది. ఎంత నిజాయతీపరుడైన అధికారి అయినా, నియామకం నిష్పక్షపాతంగా జరగనప్పుడు విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుంది" అని జగన్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుత నియామక పద్ధతిలో లోపాలున్నాయని జగన్ వివరించారు. ఈ విధానంలో ప్రధానమంత్రి, ఆయన నామినేట్ చేసిన మరో మంత్రికి రెండు ఓట్లు, ప్రతిపక్ష నేతకు ఒక ఓటు ఉంటుందని, దీంతో ప్రభుత్వానికి అనుకూలమైన వ్యక్తే కమిషనర్‌గా నియమితులవుతారని తెలిపారు. ఈ వ్యవస్థలో ఉన్న లోపాన్ని తాము తప్పు చేసిన తర్వాతే గ్రహించామని అన్నారు. ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతను కాపాడటానికి పాత పద్ధతినే పునరుద్ధరించాలని, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ), ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేతతో కూడిన కమిటీ ద్వారానే ఈసీలను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. కమిటీలో సీజేఐ ఉండటం వల్ల నియామక ప్రక్రియ నిష్పక్షపాతంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) నియామకంలో కూడా ఇదే తరహా సంస్కరణలు తీసుకురావాలని జగన్ కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు లేదా టీడీపీ ప్రభుత్వం ఎస్ఈసీని నియమించకూడదని ఆయన స్పష్టం చేశారు.

## ఎంవీఎస్ఆర్ ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించండి

శనివారం జరిగిన ఈ ప్రమాదంలో మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థిని నారాయణదాసు సోనా (18) మృతి చెందగా, మరో 14 మంది గాయపడ్డారు. విద్యుత్ దీపాలతో అలంకరించిన భారీ ఆర్చ్ అకస్మాత్తుగా కూలిపోవడంతో అక్కడున్న విద్యార్థులు ప్రమాదానికి గురయ్యారు. మృతురాలి సోదరి మీనా కూడా గాయపడినట్లు సమాచారం. వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులపై నిర్మాణం కూలిపోవడంతో అక్కడ గందరగోళం నెలకొంది. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు వైద్యసాయం అందించే చర్యలు చేపట్టారు. ఘటన అనంతరం కళాశాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రమాదం జరిగిన ప్రదేశానికి అనుమతి లేకుండా ఎవరూ వెళ్లకుండా నియంత్రణ విధించారు. వేడుకల నిర్వహణకు సంబంధించిన వివరాలు, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై విచారణ చేపట్టారు. విద్యార్థుల భద్రత కోసం ఏర్పాటు చేసిన అలంకరణ కూలిపోవడానికి గల కారణాలను గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు. డాండియా కార్యక్రమాన్ని నిర్వహించే బాధ్యతలను ప్రైవేట్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థకు అప్పగించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో భారీ ఆర్చ్ నిర్మాణానికి సంబంధించి అవసరమైన అనుమతులు తీసుకున్నారా? ఏర్పాట్ల సమయంలో భద్రతా నిబంధనలు అమలు చేశారా? అనే అంశాలను ఆదిభట్ల పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఈవెంట్ నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.కళాశాల యాజమాన్యం, కార్యక్రమ నిర్వాహకుల పాత్రపైనా దర్యాప్తు కొనసాగుతోంది. ప్రమాదం ఎలా సంభవించింది, ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారా, నిర్మాణం కూలడానికి కారణాలేమిటి అనే అంశాలపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. విచారణలో వెల్లడయ్యే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

## నితీశ్‌పై పీకే అనూహ్య ప్రశంసలు..

ఆ సమయంలో జరిగిన అనేక అవకతవకలను నేను వ్యతిరేకించాను" అని గుర్తుచేశారు. జేడీయూ ఎమ్మెల్యే అనంత్ సింగ్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలోనూ నితీశ్‌ను సమర్థిస్తూ, ఆయనను ఒక వివేకవంతమైన నాయకుడిగా అభివర్ణించారు. పాట్నా గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గంలో నితీశ్‌కు బలమైన మద్దతు ఉంది. ఈ నేపథ్యంలో ఆ ఓటర్లను ఆకట్టుకునే వ్యూహంలో భాగంగానే పీకే ఈ వ్యాఖ్యలు చేసినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. గతంలో నితీశ్‌కు అత్యంత సన్నిహితుడిగా, జేడీయూ జాతీయ ఉపాధ్యక్షుడిగా పీకే పనిచేసిన విషయం తెలిసిందే. మరోవైపు, ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరిపై తాను చేసిన వ్యాఖ్యలకు సంబంధించి వైరల్ అవుతున్న వీడియో క్లిప్‌పైనా పీకే స్పందించారు. "పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన ప్రతి ఒక్కరినీ కాల్చివేయాలనే వాదన సరైతే, ఆ లెక్కన సామ్రాట్ చౌదరి కూడా నేరస్థుడే అవుతారు. నా వ్యాఖ్యలు తప్పయితే ప్రభుత్వం నాపై కేసు నమోదు చేయవచ్చు" అని సవాల్ విసిరారు. కులం, మతాలకు అతీతంగా విద్య, ఉపాధి, ఉపాధ్యాయుల గౌరవం కోసం ఓటు వేయాలని ప్రజలను కోరారు.

## ఎల్‌నినోతో రాష్ట్రంలో కరవు పరిస్థితులు: పొన్నం ప్రభాకర్



తెలంగాణ సంస్కృతిలో బతుకమ్మకు విశిష్ట స్థానం ఉందని, మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ పండుగ ప్రజల మధ్య ఆత్మీయతను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసినప్పటికీ, ఎల్‌నినో ప్రభావం కారణంగా కరవు ముప్పు ఉండే అవకాశాలను విస్మరించలేమని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రకృతి అనుకూలించి వానలు విస్తారంగా కురిస్తే రైతులకు పంటల సాగులో మేలు జరుగుతుందని చెప్పారు. పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు ఆరోగ్యంగా, సంతోషంగా జీవించాలని గౌరీదేవతను ప్రార్థించాలని సూచించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ మండలం తోటపల్లి--గాంధీనగర్ గ్రామాల పరిధిలోని బతుకమ్మ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను మంత్రి ప్రారంభించారు. పండుగ వేడుకలు నిర్వహించే ప్రాంతంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం బతుకమ్మ వేడుకల్లో పాల్గొని స్థానికులకు శుభాకాంక్షలు అందజేశారు. తెలంగాణతో పాటు దేశంలోని పలు ప్రాంతాల్లో కరవు పరిస్థితులు నెలకొంటున్నాయని మంత్రి ప్రస్తావించారు. వ్యవసాయానికి అవసరమైన వర్షాలు సమృద్ధిగా కురవాలని, రైతులు పంటలతో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబానికి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని గౌరీదేవతను ప్రార్థించినట్లు తెలిపారు.

## రూ.4.5 లక్షలు చెల్లించినా ఉద్యోగాలు రాలేదు..

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: విదేశాల్లో ఉద్యోగాలు సాధించాలనే ఆశతో లక్షల రూపాయలు ఖర్చు చేసిన తెలంగాణ యువతకు నిరాశే మిగిలిందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. జర్మనీలో ఉపాధి కల్పిస్తామని చెప్పి ప్రభుత్వ ఆధ్వర్యంలోని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టోమ్‌కామ్) నిరుద్యోగుల నుంచి భారీ మొత్తాలు వసూలు చేసిందని విమర్శించారు. డబ్బులు చెల్లించి రెండేళ్లు గడుస్తున్నా ఉద్యోగాలు రాకపోవడంతో బాధితులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వంపై ప్రశ్నలు సంధించారు. హరీశ్‌రావు వెల్లడించిన వివరాల ప్రకారం.. సుమారు 15 జిల్లాలకు చెందిన 70 నుంచి 75 మంది యువకులు ఈ వ్యవహారంలో బాధితులుగా ఉన్నారు. ఒక్కో అభ్యర్థి నుంచి రూ.4.10 లక్షల చొప్పున వసూలు చేయగా, పరీక్షలు, బీమా, వీసా తదితర ఖర్చులు కలిపి మొత్తం సుమారు రూ.4.5 లక్షల వరకు చెల్లించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. వీరిలో పేద రైతు కుటుంబాలకు చెందిన యువకులు కూడా ఉన్నారని, కొందరు తమ కుటుంబాల్లోని మహిళల బంగారాన్ని తాకట్టు పెట్టడంతో పాటు అప్పులు చేసి నగదు సమకూర్చుకున్నారని తెలిపారు. ఉపాధి లభిస్తుందనే నమ్మకంతో తీసుకున్న అప్పులకు వడ్డీలు కడుతూ కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. విదేశీ ఉద్యోగాల కోసం ప్రయత్నించిన అభ్యర్థులకు ఇప్పటివరకు జర్మన్ కంపెనీల నుంచి ఇంటర్వ్యూ అవకాశం కూడా రాలేదని హరీశ్‌రావు ఆరోపించారు. జర్మన్ భాషలో బీ1 స్థాయి పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఇప్పుడు బీ2 అర్హత అవసరమంటూ ప్రక్రియను ముందుకు సాగనివ్వడం లేదని విమర్శించారు. తొమ్మిది మంది అభ్యర్థులు జర్మనీ వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారని టోమ్‌కామ్ ప్రచారం చేసినప్పటికీ, వారిలో ఒక్కరు కూడా అక్కడికి వెళ్లలేదని అన్నారు. అభ్యర్థులతో చేసుకున్న ఒప్పందాల్లో వివాదాలు తలెత్తితే లక్నోలోని న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి ఉంటుందనే నిబంధన పెట్టడాన్ని కూడా ఆయన తప్పుబట్టారు. తెలంగాణకు చెందిన నిరుద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతంలోని కోర్టుకు వెళ్లాల్సి రావడం ఇబ్బందికరమని పేర్కొన్నారు. సంస్థ ద్వారా ఇప్పటివరకు ఎంతమందికి ఉద్యోగాలు కల్పించారనే వివరాలను సమాచార హక్కు చట్టం కింద కోరినా, గడువు ముగిసే వరకు సమాధానం ఇవ్వలేదని ఆరోపించారు. మరోవైపు, ఇప్పటికే ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థుల సమస్యలను పరిష్కరించకుండా ఈ ఏడాది జూన్‌లో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కొత్త టోమ్‌కామ్ బ్యాచ్‌ను ప్రారంభించి ఉద్యోగాలపై హామీలు ఇవ్వడం ఏమిటని హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ప్రకటించిన రెండు లక్షల ఉద్యోగాల భర్తీ హామీ, జాబ్ క్యాలెండర్ అమలు ఏమైందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో టోమ్‌కామ్‌తో పాటు ఫెయిర్‌స్ట్రీట్ ఇండియా సంస్థ పాత్రపై సమగ్ర విచారణ జరపాలని హరీశ్‌రావు కోరారు. అభ్యర్థుల నుంచి తీసుకున్న మొత్తాలను తిరిగి చెల్లించడంతోపాటు, అప్పులపై వడ్డీల భారం, రెండేళ్లపాటు ఉపాధి కోసం ఎదురుచూసినందుకు కలిగిన నష్టానికి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. బాధితులకు ప్రత్యామ్నాయ ఉద్యోగావకాశాలు కల్పించాలని సూచించారు. యువతను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసిన ఈ వ్యవహారంపై వెంటనే సీఐడీ లేదా న్యాయ విచారణ చేపట్టి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని హరీశ్‌రావు కోరారు.

## ఎన్హెచ్ఎం ఉద్యోగుల జీతాల్లో కోత..

(మొదటి పేజీ తరువాయి)

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల జీతాలను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 1195పై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అత్యంత అన్యాయమైన చర్య అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని ఈ నిర్ణయాన్ని సమీక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఎన్హెచ్ఎం ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17,000 మంది ఎన్హెచ్ఎం ఉద్యోగులు పనిచేస్తుండగా, తాజా జీవో కారణంగా కొందరి జీతాల్లో రూ.4,000 నుంచి రూ.5,000 వరకు కోత పడిందని కవిత ఆరోపించారు. ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుతున్న ఈ క్లిష్ట సమయంలో జీతాలు తగ్గించడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కొందరికి జీతాలు పెంచి, మరికొందరికి తగ్గించడంలో వివక్ష కనిపిస్తోందని ఆమె విమర్శించారు. కేంద్రం ఎన్హెచ్ఎం జీతాల కోసం నిధులు ఇస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం వాటిని సకాలంలో విడుదల చేయడం లేదని ఆరోపించారు. ఎన్నికల ముందు ఎన్హెచ్ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు వారికి న్యాయం చేయడం లేదని కవిత విమర్శించారు. కాంగ్రెస్ పాలిత హిమాచల్ ప్రదేశ్‌తో సహా ఏడు రాష్ట్రాలు ఇప్పటికే ఎన్హెచ్ఎం సిబ్బందిని పర్మినెంట్ చేశాయని గుర్తుచేశారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా 30 శాతం జీతాలు పెంచి, వారిని క్రమబద్ధీకరించాలని అసెంబ్లీలో తీర్మానం చేసిందన్నారు. గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ, వ్యాక్సినేషన్ కార్యక్రమాల్లో ఎన్హెచ్ఎం ఉద్యోగుల పాత్ర కీలకమని కవిత నొక్కి చెప్పారు. ఉద్యోగులు నిరసన తెలిపేందుకు అనుమతి నిరాకరించడం, ఆరోగ్య మంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు పెంచడంతో పాటు, ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, ఉద్యోగులకు మద్దతుగా తమ సంస్థ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని ఆమె హెచ్చరించారు.

## మున్సిపల్ ఎన్నికలు నామినేషన్ల గడువుపై వైసీపీకి హైకోర్టులో చుక్కెదురు

(మొదటి పేజీ తరువాయి)

**అమరావతి:** మున్సిపల్ ఎన్నికల నామినేషన్లకు సంబంధించి వైసీపీ కోరిన గడువు పొడిగింపునకు హైకోర్టు అంగీకరించలేదు. నామినేషన్ల దాఖలుకు నిర్దేశించిన సమయం ఇప్పటికే ముగిసినందున, ఈ అంశంపై దాఖలైన పిటిషన్ నిరర్థకంగా మారిందని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన అనంతరం సాధారణంగా న్యాయస్థానం జోక్యం చేసుకోదని పేర్కొంది. దీంతో నామినేషన్ల గడువును పెంచాలని కోరుతూ వైసీపీ చేసిన న్యాయపరమైన ప్రయత్నం ఫలించలేదు. నామినేషన్ల స్వీకరణకు మరికొంత సమయం కేటాయించాలని కోరుతూ వైసీపీ హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. అయితే, గడువు ముగిసిన తర్వాత ఈ అంశాన్ని పరిశీలించడం వల్ల ప్రయోజనం ఉండదన్న అభిప్రాయాన్ని హైకోర్టు వ్యక్తం చేసింది. గడువు ముగిసిన విషయాన్ని పరిగణనలోకి తీసుకుని పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ నిర్ణయంతో నామినేషన్ల దాఖలుకు అదనపు అవకాశం కల్పించాలన్న వైసీపీ అభ్యర్థనకు న్యాయస్థానంలో అనుకూలత లభించలేదు. ఇదిలా ఉండగా, మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల తొలిరోజు చిత్తూరు జిల్లా పుంగనూరులో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలకు సంబంధించి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డితో పాటు సుమారు 70 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తొలిరోజే ఘర్షణలు చోటుచేసుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. పుంగనూరులో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సీనియర్ వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి పట్టణంలోకి ప్రవేశించరాదని నోటీసులు జారీ చేశారు. ఎన్నికల సమయంలో ఇరుపక్షాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరగకుండా పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. మరోవైపు, నామినేషన్ల ప్రక్రియలో అధికార పార్టీ తమ అభ్యర్థులకు అడ్డంకులు సృష్టిస్తోందని వైసీపీ ఆరోపిస్తోంది. అభ్యర్థులు స్వేచ్ఛగా ఎన్నికల్లో పాల్గొనే పరిస్థితులు కల్పించాలని ఆ పార్టీ నేతలు కోరుతున్నారు. ఈ అంశంపై న్యాయపోరాటం కొనసాగిస్తామని ఎంపీ మిథున్ రెడ్డి తెలిపారు. ఎన్ని అవరోధాలు ఎదురైనా అభ్యర్థుల హక్కుల కోసం వెనుకడుగు వేయబోమని ఆయన పేర్కొన్నారు. హైకోర్టు పిటిషన్‌ను తిరస్కరించడం, పుంగనూరులో ఘర్షణలకు సంబంధించి కేసులు నమోదవడం వంటి పరిణామాలతో ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల వ్యవహారం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఒకవైపు నామినేషన్ల గడువు అంశంపై న్యాయస్థానం నిర్ణయం వెలువడగా, మరోవైపు ఘర్షణలకు సంబంధించిన పోలీసు చర్యలు చర్చనీయాంశంగా మారాయి.

## ఏపీలో ముగిసిన నామినేషన్ల ఘట్టం!

అమరావతి, అక్టోబర్: ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల ఎంపిక, నామినేషన్ల దాఖలు వంటి తొలి దశలు పూర్తయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ల స్వీకరణ సమయం ముగియడంతో ఎన్నికల ప్రక్రియ తదుపరి అంకంలోకి ప్రవేశించింది. చివరి రోజు కావడంతో పలు ప్రాంతాల్లో అభ్యర్థులు తమ ప్రతిపాదకులు, పార్టీ కార్యకర్తలతో కలిసి ఎన్నికల అధికారుల కార్యాలయాలకు చేరుకున్నారు. సమయం ముగిసేలోపు కార్యాలయాలకు వచ్చినవారికి టోకెన్లు అందించి, వారి పత్రాలను స్వీకరించే విధానాన్ని అధికారులు అనుసరించారు. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలో ఈ ప్రక్రియ కొనసాగింది. తెలుగుదేశం పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, జనసేన, బీజేపీ అభ్యర్థులతో పాటు స్వతంత్రంగా పోటీ చేయాలనుకునేవారు కూడా నామినేషన్లు సమర్పించారు. చివరి రోజు వరకు అభ్యర్థులు కార్యాలయాల వద్దకు రావడంతో ఎన్నికల వాతావరణం నెలకొంది. గడువు పూర్తికావడంతో ఇకపై నామినేషన్ల స్వీకరణకు అవకాశం ఉండదు. ప్రకాశం జిల్లా దర్శిలో మాత్రం నామినేషన్ల దాఖలు విషయంలో కొందరు వైసీపీ అభ్యర్థులకు నిరాశ ఎదురైంది. సుమారు 25 మంది నిర్ణీత సమయానికి కార్యాలయానికి చేరుకోలేకపోవడంతో తమ పత్రాలను సమర్పించలేకపోయారు. గడువు ముగిసిపోవడంతో వారు తిరిగి వెళ్లాల్సి వచ్చింది. ఈ ఘటన స్థానికంగా రాజకీయ చర్చకు కారణమైంది. నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో ఎన్నికల అధికారులు ఇప్పుడు పత్రాల పరిశీలనపై దృష్టి పెట్టనున్నారు. అక్టోబర్ 19న నామినేషన్లను పరిశీలిస్తారు. అభ్యర్థులు తమ పేర్లను పోటీ నుంచి ఉపసంహరించుకునేందుకు అక్టోబర్ 21 వరకు అవకాశం ఉంటుంది. ఉపసంహరణల అనంతరం ఎన్నికల బరిలో మిగిలే అభ్యర్థుల సంఖ్య తేలనుంది. దీంతో ఏయే స్థానాల్లో ఎంతమంది పోటీలో ఉంటారనే అంశంపై స్పష్టత రానుంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 28న పోలింగ్ నిర్వహిస్తారు. ఓటింగ్ ముగిసిన రెండు రోజుల తర్వాత, అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు. నామినేషన్ల ఘట్టం పూర్తికావడంతో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేయనున్నారు. రాబోయే రోజుల్లో ఉపసంహరణలతో పాటు ప్రచార సరళి కూడా ఎన్నికల పోటీపై ప్రభావం చూపనుంది.

# ఇంద్రమ్మ కాలనీ అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పాటు

## బస్తీ వాసుల సమస్యల పరిష్కారానికి ముందుండి పోరాడుతాం: ఎత్తరి గోపి



**మేడ్చల్ నేటి ప్రస్థానం:-** గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలోని గౌడవెల్లి గ్రామ పరిధిలోని ఇంద్రమ్మ కాలనీలో బస్తీ వాసుల సమస్యల పరిష్కారం, కాలనీ అభివృద్ధి లక్ష్యంగా నూతనంగా ఇంద్రమ్మ కాలనీ అసోసియేషన్ కమిటీని ఏర్పాటు చేశారు. తెలంగాణ స్టేట్ స్వచ్ఛ ఆటో టిప్పర్ జేఏసీ చైర్మన్ ఎత్తరి గోపి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేసి, కాలనీ ప్రజల సంక్షేమం కోసం సమష్టిగా పనిచేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఎత్తరి గోపి మాట్లాడుతూ.. కాలనీలో నివసిస్తున్న ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి నూతన కమిటీ సభ్యులు నిరంతరం కృషి చేయాలని అన్నారు. బస్తీ వాసులకు తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు. కాలనీ అభివృద్ధి అనేది ఒక్కరి బాధ్యత కాదని, ప్రతి ఒక్కరూ భాగస్వాములైనప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కాలనీలోని ప్రజలందరినీ కలుపుకొని ముందుకు సాగుతూ, వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా నూతన కమిటీ సభ్యులు అందుబాటులో ఉంటూ వారికి అండగా నిలవాలని తెలిపారు. అలాగే కాలనీలో ఐక్యతను పెంపొందిస్తూ, ప్రజల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అవగాహన కల్పించాలని సూచించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని అన్నారు. కమిటీ సభ్యులందరూ వ్యక్తిగత ప్రయోజనాలకు అతీతంగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని పేర్కొన్నారు. ఇంద్రమ్మ కాలనీ అసోసియేషన్ నూతన కమిటీ అడ్వైజర్లుగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రవీందర్ గౌడ్, పి. మల్లేష్, మూర్తిని నియమించారు. ప్రెసిడెంట్‌గా రవి కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా విజయ్ కుమార్ గౌడ్, జనరల్ సెక్రటరీగా కృష్ణ, జాయింట్ సెక్రటరీగా రషీద్, ట్రెజరర్‌గా బాలరాజ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మహమ్మద్, సుధాకర్‌లను ఎంపిక చేశారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు కాలనీ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, వారి సమస్యల పరిష్కారానికి బాధ్యతాయుతంగా పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు. కాలనీలో మౌలిక వసతుల కల్పన, పరిశుభ్రత నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కృషి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఇంద్రమ్మ కాలనీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, కాలనీ ప్రజల ఐక్యతతో సమస్యలను పరిష్కరించుకుంటూ ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇంద్రమ్మ కాలనీ అభివృద్ధే లక్ష్యం.. బస్తీ వాసుల సంక్షేమమే ధ్యేయంగా నూతన కమిటీ పనిచేయనుందని ఎత్తరి గోపి తెలిపారు.



# జగద్గిరిగుట్టలో ఆధ్యాత్మిక సందడి..

### దుర్గాదేవి అలంకరణలో దర్శనమిస్తున్న విష్ణు కాళీ అమ్మవారు

### జగద్గిరిగుట్టలో వైభవంగా దేవీ నవరాత్రి వేడుకలు

### ఎనిమిదో రోజు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం

### అన్నదానాన్ని ప్రారంభించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొలుకుల జైహింద్



**జగద్గిరిగుట్ట, అక్టోబర్ 18 (నేటి ప్రస్థానం):** దేవీ నవరాత్రుల సందర్భంగా జగద్గిరిగుట్టలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. రాజీవ్ గృహకల్పలోని 19వ బ్లాక్ వద్ద విష్ణు కాళీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఎనిమిదో రోజు దుర్గాదేవి రూపంలో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజల్లో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయగా, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొలుకుల జైహింద్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నవరాత్రుల సమయంలో అమ్మవారిని దర్శించుకునే అవకాశం లభించడం తనకు సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. విష్ణు కాళీ యువజన సంఘం సభ్యులు ఏటా నవరాత్రి వేడుకలను భక్తితో నిర్వహిస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వడం ప్రశంసనీయమని జైహింద్ అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు భక్తుల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు, సేవాభావాన్ని చాటిచెబుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వేడుకల్లో యువజన సంఘం సభ్యులు ప్రభాకర్, వనం శ్రీను, కృష్ణ, బి. వెంకటేష్, లక్ష్మణ్, సంతోష్ యాదవ్, రాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే రాజీవ్ గృహకల్పకు చెందిన స్థానికులు, చిన్నారులు, పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాల్లో భాగస్వాములయ్యారు.

# పారిశుధ్య కార్మికులకు దసరా కానుకలు.. చీరలు అందజేసిన బీజేపీ నేత కొరదల నరేష్

### కూకట్‌పల్లిలో జీహెచ్‌ఎంసీ సిబ్బందికి చీరల పంపిణీ

### కార్మికుల సేవలను గుర్తించి గౌరవించుకోవాలని డా. కొరదల నరేష్ పిలుపు



**కూకట్‌పల్లి, అక్టోబర్ 18 (నేటి ప్రస్థానం):** ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం శ్రమించే పారిశుధ్య సిబ్బందికి దసరా పండుగ సందర్భంగా చీరలను అందజేశారు. బీజేపీ సీనియర్ నాయకుడు డా. కొరదల నరేష్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించి, జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికులకు పండుగ కానుకలు పంపిణీ చేశారు. పండుగ వేళ కార్మికులతో ఆత్మీయంగా గడుపుతూ వారి సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ.. నగర పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు, వీధులు పరిశుభ్రంగా కనిపించేందుకు వారు ప్రతిరోజూ శ్రమిస్తున్నారని తెలిపారు. వాతావరణ పరిస్థితులతో సంబంధం లేకుండా విధులు నిర్వహించే వారి కృషిని ప్రతి ఒక్కరూ గుర్తించాలని, తగిన గౌరవం ఇవ్వాలని అన్నారు. దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో సంతోషాన్ని నింపాలనే ఆకాంక్షతో కార్మికులకు చీరలు అందించినట్లు ఆయన వివరించారు. పండుగ వేళ సమాజంలోని అన్ని వర్గాల వారూ ఆనందంగా ఉండాలనే భావనతో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ప్రాధాన్యతను సంతరించుకుంటుందని పేర్కొన్నారు. ప్రజలకు సేవలందించే కార్మికులను ఆదరించడం, వారి కష్టాన్ని గుర్తించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని నరేష్ తెలిపారు. పండుగల సమయంలో వారికి ఆప్యాయతను పంచడం ద్వారా ప్రోత్సాహాన్ని అందించవచ్చని అన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా సామాజిక బాధ్యతను చాటుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కె.వి. లావణ్య, మౌనిక, సిద్ధార్థ్ తదితరులు పాల్గొన్నారు.

# మధు ప్రెసిషన్ ఇంజనీరింగ్ వర్క్స్‌లో ఘనంగా విజయదశమి ప్రత్యేక పూజలు

### ఉద్యోగులకు పండుగ బోనస్‌లు, స్వీట్ల పంపిణీ

### బండి మధుసూదన్ రెడ్డి కుటుంబానికి ఘన సన్మానం



**కూకట్‌పల్లి/నేటి ప్రస్థానం /అక్టోబర్ 18:** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లిలోని మధు ప్రెసిషన్ ఇంజనీరింగ్ వర్క్స్‌లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పండుగను పురస్కరించుకుని సంస్థలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, సంస్థ యజమాని బండి మధుసూదన్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు సంస్థ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంస్థ అభివృద్ధి, సిబ్బంది సంక్షేమం, అందరి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలను ఆకాంక్షిస్తూ పూజలు చేశారు. విజయదశమి సందర్భంగా సంస్థ యాజమాన్యం ఉద్యోగుల పట్ల తన అభిమానాన్ని చాటుకుంది. పూజా కార్యక్రమాల అనంతరం సిబ్బంది అందరికీ ప్రత్యేకంగా భోజన ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా స్వీట్లు పంపిణీ చేయడంతో పాటు ఉద్యోగులకు పండుగ బోనస్‌లను అందజేశారు. పండుగ వేళ యాజమాన్యం తమతో ఆనందాలను పంచుకోవడం పట్ల సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు. సంస్థ యాజమాన్యం, ఉద్యోగుల మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం కావడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సంస్థ యజమాని బండి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ విజయదశమి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలు, సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖశాంతులతో జీవించాలని కోరుకున్నారు. సంస్థ అభివృద్ధిలో ఉద్యోగుల కృషి, అంకితభావం ఎంతో కీలకమని పేర్కొంటూ, యాజమాన్యం, సిబ్బంది పరస్పర సహకారంతో ముందుకు సాగినప్పుడే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరి కుటుంబంలో సంతోషం వెల్లివిరియాలని, పండుగలు అందరి జీవితాల్లో నూతనోత్సాహాన్ని నింపాలని ఆకాంక్షించారు.

**బండి మధుసూదన్ రెడ్డి కుటుంబానికి సన్మానం**

విజయదశమి సందర్భంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో భాగంగా సూర్య ఉదయం తెలుగు దినపత్రిక తెలంగాణ ఎడిటర్ బాషా మరియు టీం సభ్యులు బుజ్జి, క్రాంతి కుమార్ లు శాలువాతో సన్మానించారు. అనంతరం గ్రామ దండోరా ఎడిటర్ నర్సింహా రావు, స్థానిక విలేకరి ప్రసాద్ లు శాలువాతో సత్కరించారు. అనంతరం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శివ రెడ్డి, జి.ఎల్.ఎన్. రెడ్డి, ఉపేందర్ రెడ్డిలు సంస్థ యజమాని బండి మధుసూదన్ రెడ్డి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. భారీ గజమాలతో కుటుంబ సభ్యులను సత్కరించి విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. పండుగను పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక పూజలు, ఉద్యోగులకు బోనస్‌ల పంపిణీ, కుటుంబ సభ్యులకు సన్మానం వంటి కార్యక్రమాలతో మధు ప్రెసిషన్ ఇంజనీరింగ్ వర్క్స్‌లో పండుగ సందడి నెలకొంది. సంస్థ యాజమాన్యం, సిబ్బంది, నాయకులు పరస్పరం విజయదశమి శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఆనందోత్సాహాల మధ్య వేడుకలను జరుపుకున్నారు. పండుగలు సామాజిక ఐక్యతను, పరస్పర గౌరవాన్ని పెంపొందించడంతో పాటు అందరిలో సోదరభావాన్ని చాటుతాయని ఈ వేడుకలు మరోసారి స్పష్టం చేశాయి.

# బతుకమ్మ వేడుకలలో పాల్గొన్న కాచారం లావణ్య

కూకట్‌పల్లిలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆటపాటలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో లావణ్య కాచారం పాల్గొన్నారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ వేడుకలతో ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది.



# నూతనకల్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

### కౌన్సిలర్లు సద్ది సురేష్ రెడ్డి, చిన్నోళ్ల భాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు



**ఎల్లంపేట్:** ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని నూతనకల్ గ్రామంలో బతుకమ్మ సంబరాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా కౌన్సిలర్లు సద్ది సురేష్ రెడ్డి, చిన్నోళ్ల భాస్కర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకలకు గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. అనంతరం నూతనకల్ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డీజే వాయిద్యాల నడుమ బతుకమ్మలను ఉంచి సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా గ్రామస్తులంతా వేడుకల్లో పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

**మహిళల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు:** బతుకమ్మ వేడుకల్లో పాల్గొనే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కౌన్సిలర్లు సద్ది సురేష్ రెడ్డి, చిన్నోళ్ల భాస్కర్ అన్ని రకాల సదుపాయాలు కల్పించారు. బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేసేందుకు వెళ్లే మార్గాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు రాకపోకలకు అనుకూలంగా ఏర్పాట్లు చేశారు. పండుగ సందర్భంగా మహిళలకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

**చెరువు వద్ద పటిష్ట బందోబస్తు:** బతుకమ్మ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా చెరువు పరిసరాల్లో ప్రత్యేక జాగ్రత్తలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. మహిళలు బతుకమ్మలను సంప్రదాయబద్ధంగా చెరువు వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. కార్యక్రమం సజావుగా జరిగేలా నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ:** బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని గ్రామస్తులు పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలంతా కలిసికట్టుగా పండుగను జరుపుకోవడం ఆనందాన్ని కలిగించింది. కౌన్సిలర్లు సద్ది సురేష్ రెడ్డి, చిన్నోళ్ల భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బతుకమ్మ సంబరాల్లో మహిళలతో పాటు పురుషులు, ఈ కార్యక్రమంలో యూనిస్ పాషా, బిఆర్ఎస్ నాయకులు, గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక



### జగద్గిరిగుట్టలో కన్నులపండువగా

# సద్దుల బతుకమ్మ

### ఒక్కటై ఆడిపాడిన ఆడపడుచులు

**కూకట్ పల్లి/నేటి ప్రస్థానం/ అక్టోబర్ 18:** తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ వేడుకలు జగద్గిరిగుట్ట పరిధిలోని అంజయ్యనగర్‌లో అత్యంత వైభవంగా, కన్నులపండువగా సాగాయి. ఆదివారం సాయంత్రం స్థానిక ఆడపడుచులంతా ఒకేచోటికి చేరి బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. తీరొక్క పూలతో సుందరంగా అమర్చిన బతుకమ్మలను మధ్యలో ఉంచి, మహిళలంతా చప్పట్లు కొడుతూ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. రంగురంగుల విద్యుత్ దీపాల కాంతులు, తీరొక్క పూల పరిమళాల నడుమ అంజయ్యనగర్ పరిసరాలన్నీ పండుగ శోభతో విలసిల్లాయి. మహిళలు ఒకరికొకరు వాయనాలు ఇచ్చిపుచ్చుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అనంతరం గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, సమీపంలోని జలశయాల్లో బతుకమ్మలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. తీరొక్క పూల జాతరను తలపించిన ఈ వేడుకల్లో స్థానిక మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంతోషాన్ని పంచుకున్నారు.

## బండమాదారంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

### బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ మేకల రజిత దేవేందర్ రెడ్డి





**మేడ్చల్ నేటి ప్రస్థానం:-** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని బండమాదారం 19వ వార్డులో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ మేకల రజిత దేవేందర్ రెడ్డి పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో భాగ స్వాములయ్యారు. తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటపాటలతో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మహిళల సందడి, బతుకమ్మ పాటలతో బండమాదారం 19వ వార్డులో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మేకల రజిత దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ మహిళలు ఐకమత్యంతో జరుపుకునే ఈ పండుగకు ప్రత్యేకమైన గుర్తింపు ఉందన్నారు. తెలంగాణ సంస్కృతిని, ఆచార సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. బతుకమ్మ వేడుకలు మహిళల్లో ఐక్యతను, ఆత్మీయతను పెంపొందించడంతో పాటు మన సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెబుతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ తెలంగాణ పండుగలను ఆదరిస్తూ, మన సంస్కృతి వైభవాన్ని కాపాడుకోవాలని ఆకాంక్షించారు. బండమాదారం 19వ వార్డులో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మహిళలు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొని పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

# తెలంగాణ ఆడపడుచుల జీవితాల్లో ఆనందాల బతుకమ్మ వెల్లివిరియాలి: సాయిపేట శ్రీనివాస్

### గుండ్లపోచంపల్లిలో మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మాజీ కౌన్సిలర్

### తెలంగాణ అస్తిత్వానికి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రత్యేక గుర్తింపు

### ప్రతి కుటుంబం సిరిసంపదలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్ష

**గుండ్లపోచంపల్లి, అక్టోబర్ 18 (నేటి ప్రస్థానం):** తెలంగాణ ఆడపడుచుల జీవితాల్లో బతుకమ్మ పండుగ కొత్త వెలుగులు నింపాలని, ప్రతి ఇంటా సంతోషాలు వెల్లివిరియాలని మేడ్చల్ మాజీ జెడ్పీటీసీ, గుండ్లపోచంపల్లి 299వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్ ఆకాంక్షించారు. పెద్ద బతుకమ్మ పర్వదినాన్ని పురస్కరించుకుని డివిజన్ పరిధిలోని మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం గుండ్లపోచంపల్లిలోని పలు కాలనీల్లో జరిగిన వేడుకలకు హాజరై మహిళలతో మమేకమయ్యారు.

**తెలంగాణ వైభవానికి ప్రతీక బతుకమ్మ**

పూలను పూజిస్తూ ప్రకృతితో మమేకమయ్యే బతుకమ్మ వేడుకలు తెలంగాణ ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెబుతాయని సాయిపేట శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ పండుగకు తరతరాలుగా వస్తున్న చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యం ఉందని తెలిపారు. మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయబద్ధంగా నిర్వహించే సంబరాలు మన ప్రాంతీయ వైభవాన్ని ప్రతిబింబిస్తాయని వివరించారు.



**ఐక్యతను పెంచే పండుగ**

కుటుంబాలు, బంధువులు, స్నేహితులు ఒకచోట చేరి ఆనందంగా గడిపేందుకు పండుగలు చక్కటి అవకాశమని ఆయన అన్నారు. బతుకమ్మ సంబరాలు మహిళల మధ్య పరస్పర ఆప్యాయతను పెంచడంతో పాటు సమాజంలో ఐకమత్యానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఆధునిక కాలంలోనూ మన పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆచారాలను మరచిపోకుండా, రాబోయే తరాలకు వాటి గొప్పతనాన్ని తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

**ప్రతి ఇంటా సిరిసంపదలు వెల్లివిరియాలి**

గుండ్లపోచంపల్లి 299వ డివిజన్ పరిధిలోని గ్రామాలు, కాలనీల మహిళలంతా ఉత్సాహంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం సంతోషకరమని సాయిపేట శ్రీనివాస్ అన్నారు. పెద్ద బతుకమ్మ పండుగ ప్రతి కుటుంబానికి శుభాలను తీసుకురావాలని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. మహిళల జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, అభివృద్ధి నిండాలని కోరుకుంటూ వేడుకల్లో పాల్గొన్న వారికి మరోసారి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి 299వ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కుండ భానుచందర్‌తో పాటు ప్రవీణ్, భాస్కర్, కిషన్, సంపత్, అనిల్, ఉదయ్, వెంకట్, మల్లేష్, వినోద్, సుధాకర్, పిలిప్స్ తదితరులు పాల్గొన్నారు.

# డబిల్ పూర్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

### కౌన్సిలర్లు విగ్నేశ్వర్ రెడ్డి, హరీఫ్, ముత్యాల గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు







**మేడ్చల్ నేటి ప్రస్థానం:** ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని డబిల్ పూర్ లో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను కౌన్సిలర్లు విగ్నేశ్వర్ రెడ్డి, హరీఫ్, ముత్యాల గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాలకు డబిల్ పూర్ గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. పండుగ సందర్భంగా మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. అనంతరం డబిల్ పూర్ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డీజే వాయిద్యాల మధ్య బతుకమ్మలను ఉంచి, సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. మహిళల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు చెరువు వద్దకు వెళ్లే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కౌన్సిలర్లు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దారుల వెంట విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి, రాకపోకలకు అనుకూలంగా సౌకర్యాలు కల్పించారు. బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా చెరువు వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పూర్తి బందోబస్తు ఏర్పాటు చేశారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను తీసుకొని చెరువు వద్దకు చేరుకుని నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. పండుగ వేడుకలు ప్రశాంతంగా జరిగేలా అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నారు.

**సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ**

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను నూతనకల్ గ్రామ ప్రజలు ఐకమత్యంతో జరుపుకున్నారు. మహిళలతో పాటు పురుషులు కూడా ఈ వేడుకల్లో పాల్గొని సంబరాలను విజయవంతం చేశారు. పూల పండుగైన బతుకమ్మ వేడుకలు గ్రామ ప్రజల్లో ఆనందోత్సాహాలను నింపాయి.

**కౌన్సిలర్లు విగ్నేశ్వర్ రెడ్డి, హరీఫ్, ముత్యాల గౌడ్**

ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు విగ్నేశ్వర్ రెడ్డి, హరీఫ్, ముత్యాల గౌడ్, నాయకులు డబిల్ పూర్ మాజీ సర్పంచ్ దుడ్డు సంజీవరావు, మాజీ వార్డ్ సభ్యుడు నర్సింగ్ గౌడ్, మాజీ వార్డు సభ్యుడు సత్యనారాయణ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సల్ల వెంకటేష్ యాదవ్, భవాని వెంకటేష్, సీనియర్ నాయకుడు శ్రీరామ్ రెడ్డి, నాయకులు మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు గ్రామ మహిళలు, పురుషులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మేడ్చల్ సీఎస్ఐ వెస్లీ చర్చిలో ఘనంగా యువజన ఆదివార వేడుకలు

### క్రైస్తవ విలువలతో జీవించాలి..
### విశ్వాసంలో స్థిరంగా నిలవాలి: రెవరెండ్ సైరస్

**మేడ్చల్ నేటి ప్రస్థానం:-** మేడ్చల్‌లోని సీఎస్ఐ వెస్లీ చర్చిలో యువజన ఆదివార వేడుకలను ఘనంగా నిర్వహించారు. చర్చి ప్రెస్బిటర్ ఇన్‌ఛార్జ్ రెవరెండ్ జోసెఫ్ కిషోర్ మార్గదర్శకత్వంలో జరిగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మికత, ఉత్సాహం, ఐక్యతతో కొనసాగింది. చర్చి యువత ప్రత్యేక ఆసక్తితో పాల్గొని వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. యువజన ఆదివారం వేడుకల్లో భాగంగా యువత ప్రదర్శించిన స్ఫూర్తిదాయకమైన నాటికలు, నృత్యాలు, ఆధ్యాత్మిక గీతాలు, ఇతర ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆయా ప్రదర్శనల ద్వారా యువతతో పాటు సంఘ సభ్యులకు మంచి సందేశాలను అందించారు. యువతలోని ప్రతిభను చాటడంతో పాటు వారి విశ్వాసం, నిబద్ధత, ఐక్యతను ఈ కార్యక్రమం ప్రతిబింబించింది. ఆరాధనలో యువత చురుకైన భాగస్వామ్యం చర్చి సభ్యులను ఆకట్టుకుంది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన రెవరెండ్ సైరస్ దైవవాక్యాన్ని బోధిస్తూ సమాజంలో ఎదురయ్యే మంచి, చెడు పరిస్థితులపై సమయోచితమైన సందేశాన్ని అందించారు. యువత జీవితంలో ఎదురయ్యే సవాళ్లను విశ్వాసంతో ఎదుర్కోవాలని, క్రైస్తవ విలువలకు కట్టుబడి ఉండాలని సూచించారు. ప్రతి సందర్భంలోనూ విచక్షణతో నిర్ణయాలు తీసుకుంటూ, విశ్వాసంలో స్థిరంగా నిలబడాలని పిలుపునిచ్చారు. కుటుంబాలు, చర్చి సంఘాలు, సమాజంలో సానుకూల మార్పునకు దోహదపడేలా యువత తమ ప్రవర్తనను తీర్చిదిద్దుకోవాలని ప్రోత్సహించారు. యువత ఆధ్యాత్మికంగా ఎదగడంతో పాటు సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.





ప్రేమ, కరుణ, సేవాభావం, ఐక్యత వంటి క్రైస్తవ విలువలను ఆచరణలో పెట్టాలని సందేశమిచ్చారు. దైవవాక్యాన్ని జీవితానికి మార్గదర్శకంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. ఈ యువజన ఆదివార వేడుకలు చర్చి సభ్యులు, యువత, కుటుంబాలు, అతిథులు పరస్పరం ప్రేమాభిమానాలను పంచుకునేందుకు వేదికగా నిలిచాయి. ఆరాధన, ఆధ్యాత్మిక బోధన, యువత ప్రదర్శనలు, సహవాసం ద్వారా సంఘ సభ్యుల్లో ఐక్యతా భావం మరింత బలపడింది. చర్చి కుటుంబమంతా కలిసి ఆనందంగా పాల్గొనడంతో కార్యక్రమం ఆశీర్వాదకరంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో శ్రీమతి శ్రీలత జోసెఫ్ కిషోర్, తుమ్మల విల్సన్ (ఏసీటీసీ శిక్షణార్థి), చర్చి కమిటీ సభ్యులు, మహిళా కార్యదర్శి శ్రీమతి రజినీ, చర్చి కార్యదర్శి ఎం. స్వామి దాస్, కోశాధికారి కట్ట బెన్నెట్ సురేందర్ కో, స్టీవార్డ్ సీఏ శ్రీధర్, యువజన కార్యదర్శి మానస కెన్నెడీ, చర్చి సభ్యులు, యువజన సభ్యులు తదితరులు పాల్గొన్నారు. చివరగా ఆత్మీయ సహవాస భోజనాన్ని ఏర్పాటు చేశారు. పరస్పర ప్రేమ, సఖ్యత, ఐక్యతను చాటుతూ జరిగిన ఈ వేడుక చర్చి సభ్యులకు ఆధ్యాత్మిక ప్రోత్సాహాన్ని అందించిన విశేష కార్యక్రమంగా నిలిచింది.



## 8వ రోజు దుర్గామాత మండపాలను సందర్శించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు

**కూకట్‌పల్లి/నేటి ప్రస్థానం /అక్టోబర్ 18:** దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో కొలువుదీరిన దుర్గామాత మండపాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు సందర్శించారు. నిర్వాహకుల ఆహ్వానం మేరకు మండపాలను సందర్శించి, అమ్మవారి దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మండపాలను సందర్శించిన రాజేశ్వరరావుకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఘన స్వాగతం పలికి, శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేవీ శరన్నవరాత్రులు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, దుర్గామాత ఆరాధన భక్తి, శక్తి, ధర్మం, ఐక్యతకు ప్రతిరూపమని అన్నారు. నవరాత్రి ఉత్సవాలు భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యతా భావాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, కూకట్‌పల్లి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజల జీవితాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కోరారు.

## సీఎం రేవంత్‌కు బండ్ల గణేశ్ విజ్ఞప్తి

**పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి బండ్ల గణేశ్ విజ్ఞప్తి**

**అక్రమ నిల్వలతో దాణా ధరలు విపరీతంగా పెంచుతున్నారని ఆరోపణ**



మొక్కజొన్న, సోయాబీన్ వంటి ముడిసరుకులను గోదాముల్లో దాస్తున్నారని ఆవేదన పౌల్ట్రీ పరిశ్రమ ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై తక్షణమే స్పందించి, రైతులను ఆదుకోవాలని ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఈరోజు ఆయన ముఖ్యమంత్రిని ఉద్దేశించి ఒక ప్రకటన చేశారు. పౌల్ట్రీ పరిశ్రమకు కీలకమైన మొక్కజొన్న, సోయాబీన్, డీఓసీ వంటి ముడిసరుకులను కొందరు స్టాకిస్టులు అక్రమంగా గోదాముల్లో నిల్వ చేస్తున్నారని బండ్ల గణేశ్ ఆరోపించారు. దీనివల్ల మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టించి, ధరలను అమాంతం పెంచుతున్నారని ఆయన పేర్కొన్నారు. "ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ అక్రమ నిల్వలపై చర్యలు తీసుకోవాలి. పౌల్ట్రీ రంగానికి, రైతులకు న్యాయం జరిగేలా చూడాలి" అని ఆయన కోరారు. ఇప్పటికే అనేక ఆర్థిక, సాంకేతిక సమస్యలతో సతమతమవుతున్న పౌల్ట్రీ రైతులకు ఈ ధరల పెరుగుదల అదనపు భారంగా మారిందని బండ్ల గణేశ్ తెలిపారు. సంబంధిత అధికారులతో ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేసి, రైతులకు సరసమైన ధరలకు, సకాలంలో ముడిసరుకులు అందేలా చూడాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. తెలంగాణ పౌల్ట్రీ రైతుల తరఫున తాను ఈ విజ్ఞప్తి చేస్తున్నానని, ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకోవాలని ఆయన అన్నారు.

## మాదాపూర్‌లో అగ్నిప్రమాదం.. అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది

**మాదాపూర్:** మాదాపూర్ పరిధిలోని యూనిస్ట్రింగ్ టెక్ సొల్యూషన్స్ సంస్థలో శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది. యాంటీ డ్రోన్ పరీక్షా పరికరాలను సిద్ధం చేస్తున్న ఈ సంస్థలో మంటలు చెలరేగడంతో అప్రమత్తమైన సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే మూడు అగ్నిమాపక వాహనాలు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చాయి. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని పోలీసులు తెలిపారు.ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు, ఆస్తి నష్టం వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని మాదాపూర్ ఎస్‌హెచ్‌ఓ కెవి సుబ్బారావు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేశారని, దీంతో కూలింగ్ సిస్టమ్‌పై ప్రభావం పడి బ్యాటరీలు వేడెక్కి మంటలు చెలరేగి ఉండొచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నట్లు చెప్పారు. వివరణాత్మక తనిఖీ, దర్యాప్తు అనంతరం అసలు కారణాలు వెల్లడవుతాయని పోలీసులు పేర్కొన్నారు.

## కూకట్‌పల్లిలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**మాజీ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ నివాసంలో సంప్రదాయబద్ధంగా బతుకమ్మ సంబరాలు**

**కూకట్ పల్లి, :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలు కూకట్‌పల్లిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కూకట్ పల్లి డివిజన్ మాజీ జూపల్లి సత్యనారాయణ నివాసంలో ఆయన కుమార్తె కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు చేరి బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో పండుగ సందడిని నింపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.

# ఏపీకి గోదావరి బోర్డులో ఎదురుదెబ్బ..

**ఆ ప్రాజెక్టుల జోలికి వెళ్లలేమన్న బోర్డు..తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరాలను తోసిపుచ్చిన గోదావరి బోర్డు**

**అనుమతులు పొందిన ప్రాజెక్టులను పునఃసమీక్షించే అధికారం లేదని స్పష్టీకరణ**

**ఈ నెల 30న జరగనున్న బోర్డు సమావేశం..నిధులు, టెలిమెట్రీ కేంద్రాల ఏర్పాటుపై అజెండాలో చర్చ**



తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యక్తం చేసిన అభ్యంతరాలను గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) తోసిపుచ్చింది. ఇప్పటికే అన్ని అనుమతులు పొందిన ప్రాజెక్టుల గురించి మళ్లీ చర్చించే అధికారం తమకు లేదని బోర్డు స్పష్టం చేసింది. ఈ మేరకు ఏపీ అభ్యంతరాలను పక్కన పెడుతూ నిర్ణయం తీసుకుంది. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), టెక్నికల్ అడ్వైజరీ కమిటీ (టీఏసీ)ల నుంచి అనుమతులు పొందిన ప్రాజెక్టులను పునఃసమీక్షించలేమని గోదావరి బోర్డు తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ వ్యక్తం చేసిన అభ్యంతరాలను బోర్డు పరిగణనలోకి తీసుకోలేదు. మరోవైపు, ఈ నెల 30వ తేదీన జరగనున్న బోర్డు సమావేశానికి సంబంధించిన అజెండాను ఉభయ రాష్ట్రాలకు పంపింది. గత 17వ సమావేశపు మినిట్స్‌ను ఆమోదించడం, బోర్డు నిర్వహణకు తెలుగు రాష్ట్రాలు నిధులు కేటాయించడం, ప్రాజెక్టుల వద్ద నీటి లభ్యతను కొలిచేందుకు టెలిమెట్రీ కేంద్రాల ఏర్పాటు వంటి కీలక అంశాలను అజెండాలో చేర్చారు. వీటితో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాజెక్టుల మదింపు పురోగతిపైనా ఈ సమావేశంలో చర్చించనున్నారు. అయితే, తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన ఏపీ అభ్యంతరాలకు అజెండాలో చోటు కల్పించకపోవడం గమనార్హం.

# చిరుమర్తి గ్రామంలో అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సద్దుల బతుకమ్మ**

**బతుకమ్మ దసరా శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ కూరెళ్ల వెంకటాచారి నాగమణి**





**ప్రభాత సూర్య మాడుగుల పల్లి :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సద్దుల బతుకమ్మ అని సర్పంచ్ కూరెళ్ల నాగమణి అన్నారు నల్లగొండ జిల్లా మాడుగుల పల్లి మండల పరిధిలోని చిరుమర్తి గ్రామంలో సర్పంచ్ కూరెళ్ల వెంకటాచారి నాగమణి ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, రంగురంగుల పూలతో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కూరెళ్ల నాగమణి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, మహిళల ఆత్మగౌరవానికి, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి నిదర్శనమని అన్నారు. తెలంగాణ ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ గ్రామాల్లో ఐకమత్యాన్ని, సోదరభావాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. మహిళలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేలా ప్రతి ఒక్కరూ పండుగలను సంప్రదాయ బద్ధంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సద్దుల బతుకమ్మ వేడుకలతో చిరిమర్తి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామ ప్రజలకు సర్పంచ్ బతుకమ్మ దసరా శుభాకాంక్షలు తెలిపరు.



## లక్ష్మీదేవిగూడెం గ్రామంలోసద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న సర్పంచ్ ఎలికట్టి భరత్

**వేములపల్లి అక్టోబర్ 18:** నల్గొండ జిల్లా వేములపల్లి మండలం లక్ష్మీదేవిగూడెం గ్రామంలో ఘనంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో గ్రామ సర్పంచ్ ఎలికట్టి భరత్ ఉప సర్పంచ్ గంట స్వాతినరసయ్య, పాల్గొన్నారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ పాటలతో సందడి చేశారు. మహిళల ఆటపాటలు, రంగురంగుల బతుకమ్మలతో గ్రామంలో పండుగ శోభ సంతరించుకుంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను గ్రామస్థులు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. సద్దుల బతుకమ్మ వేడుకలతో లక్ష్మీదేవిగూడెం గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది





## బతుకమ్మ సంబరాలకు బతుకమ్మ ఘాట్ సిద్ధం!

**నీలం సంజీవరెడ్డి నగర్‌లో ఘాట్ ప్రారంభించిన నిర్మాణ దాత కందాడ లక్ష్మారెడ్డి**

**తుర్కయంజాల్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ప్రకృతిని పూజిస్తూ, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో తొమ్మిది రోజులపాటు సంబరాలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని తుర్కయంజాల్ డివిజన్ నీలం సంజీవరెడ్డి నగర్ కాలనీలో మహిళల సౌకర్యార్థం నిర్మించిన బతుకమ్మ ఘాట్‌ను నిర్మాణ దాత, రాగన్నగూడ మాజీ సర్పంచ్ ఒ ఎంపీటీసీ కందాడ లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.బతుకమ్మ ఘాట్ అందుబాటులోకి రావడంతో కాలనీలోని మహిళలు బతుకమ్మలను ఆడేందుకు, నిమజ్జనం చేసేందుకు సౌకర్యంగా ఉంటుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సామ భీమ్ రెడ్డి, శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి భజన మండలి కమిటీ సభ్యులు కందాడ సురేందర్ రెడ్డి,కుంట జంగారెడ్డి,గొరిగే నరసింహ,ధార వెంకటేష్,మట్ట రమేష్,మొద్రి నాగరాజు,గొరిగే రమేష్,నర్సింగ్ మహేష్,చంద్రశేఖర్,గణేష్,మట్ట శ్రీశైలం,నాగ చైతన్య,భాను, మెట్టు,సాయి,నాయకులు ఓర్సు శ్రీనివాస్,మహిళా సభ్యులు కుంట పార్వతి,గొరిగే మాధవి, వరలక్ష్మి తదితరులు హాజరయ్యారు.



## మేడ్చల్ గడి మైసమ్మ తల్లిని దర్శించుకున్న ఎంపి ఈటల రాజేందర్

### దుర్గాదేవి అలంకరణలో అమ్మవారి దర్శనం..

### లక్షపూల పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు

**మేడ్చల్ నేటి ప్రస్థానం:-**మేడ్చల్ పట్టణంలోని శ్రీ శ్రీ శ్రీ గడి మైసమ్మ తల్లి ఆలయంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని దుర్గాదేవి అలంకరణలో విశేషంగా అలంకరించి, లక్షపూల పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఆలయాన్ని సందర్శించి, గడి మైసమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శరన్నవరాత్రుల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. లక్షపూల పూజలో భాగంగా అమ్మవారికి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, లోకకల్యాణం, ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. పండుగల ద్వారా ఆధ్యాత్మికతతో పాటు భక్తి, సంప్రదాయాలు, సామాజిక ఐక్యత మరింత బలపడతాయని భక్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పట్లోళ్ల విక్రమ్ రెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్, మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ కోశాధికారి లవంగ శ్రీకాంత్, మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ ప్రధాన కార్యదర్శి కానుకంటి వంశీ విజయ్ వంజరి, ఉపాధ్యక్షుడు మైసరి రాజు వంజరి, బీజేపీ నాయకులు పికెట్ నర్సింగ్ రావు, ఆలయ కమిటీ సభ్యులు తాళ్లపల్లి శివకుమార్, అనిల్, శ్యామరావు, రాము, మిరియాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. శ్రీ గడి మైసమ్మ తల్లి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ నిర్వహిస్తున్న ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందుతున్నారు.

## రాజబొల్లారం తాండలో పారిశుధ్య కార్మికులకు ఘన సన్మానం

### దసరా పండుగ కానుకల పంపిణీ.. కార్మికుల సేవలకు గుర్తింపు

### "ప్రజా సేవే మా లక్ష్యం..

### వార్డు అభివృద్ధే మా ధ్యేయం కౌన్సిలర్ శాంతి రాజు నాయక్‌లి





మేడ్చల్ నేటి ప్రస్థానం: ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని రాజబొల్లారం తాండ 4వ వార్డులో దసరా పండుగను పురస్కరించుకుని పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్మికులకు దసరా పండుగ కానుకలను అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ శాంతి రాజు నాయక్ మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికులు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతిరోజూ వార్డులోని వీధులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు వారు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఎండ, వర్షాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తూ ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించేందుకు కృషి చేస్తున్న కార్మికుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించి గౌరవించాలని సూచించారు. పారిశుధ్య కార్మికులు సమాజానికి అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని, వారి కృషి వల్లే ప్రజలకు ఆరోగ్యకరమైన పరిసరాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పండుగ సమయాల్లో కార్మికులతో సంతోషాలను పంచుకోవడం, వారికి తగిన గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమానికి, వార్డు అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. దసరా పండుగ సందర్భంగా పారిశుధ్య కార్మికులను సన్మానించి కానుకలు అందజేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సేవలో నిరంతరం నిమగ్నమయ్యే కార్మికులను గౌరవించడం సమాజంలో స్ఫూర్తిని నింపుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎస్టీ సెల్‌కు చెందిన ఆకాష్ నాయక్, సంతోష్ నాయక్, రామచంద్ర నాయక్, బాబురావు నాయక్, గోపాల్, రవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సేవే మా లక్ష్యం.. వార్డు అభివృద్ధే మా ధ్యేయం అనే సంకల్పంతో ప్రజలకు అందుబాటులో ఉంటూ వార్డు అభివృద్ధికి కృషి చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

# కాలకల్ కేఎల్ఆర్ వెంచర్‌లో అక్రమ నిర్మాణాల జోరు

### సెల్లార్‌తో పాటు మూడు అంతస్తుల నిర్మాణం.. పట్టించుకోని గ్రామపంచాయతీ అధికారులు

### చిన్న ఇంటి నిర్మాణానికే అనుమతులు తప్పనిసరి.. భారీ నిర్మాణంపై ఎందుకీ మౌనం?

### నిబంధనలు సామాన్యులకేనా? ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికుల డిమాండ్



**మనోహరాబాద్, అక్టోబర్ 18:-** మనోహరాబాద్ మండలంలోని కాలకల్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న కేఎల్ఆర్ వెంచర్‌లో అనుమతులు లేకుండానే సెల్లార్‌తో పాటు మూడు అంతస్తుల నిర్మాణం చేపడుతున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ఇంత భారీ నిర్మాణం జరుగుతున్నప్పటికీ సంబంధిత గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా? లేవా? అనే విషయాన్ని అధికారులు వెంటనే పరిశీలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**సామాన్యులకో నిబంధనలు..**

**భారీ నిర్మాణాలకో నిబంధనల సడలింపా?**

గ్రామంలో సామాన్యులు చిన్న ఇల్లు నిర్మించుకోవాలన్నా గ్రామపంచాయతీ అనుమతులు తప్పనిసరి చేస్తూ, వివిధ రకాల రుసుములు వసూలు చేస్తున్న అధికారులు, సెల్లార్‌తో పాటు మూడు అంతస్తుల నిర్మాణం జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నప్పటికీ ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. చిన్న నిర్మాణాల విషయంలో నిబంధనలను కఠినంగా అమలు చేసే అధికారులు, భారీ నిర్మాణాల విషయంలో మాత్రం మౌనం వహిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భవన నిర్మాణానికి అనుమతులు, నిబంధనలు ప్రతి ఒక్కరికీ సమానంగా వర్తించాల్సి ఉండగా, కొందరి నిర్మాణాల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా? అనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ పరిధిలో నిర్మాణాలు చేపట్టే ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాల్సిందేనని, నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వారు పేర్కొంటున్నారు.

**అధికారుల మౌనం వెనుక కారణమేంటి?**

కేఎల్ఆర్ వెంచర్‌లో జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిర్మాణంపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టకపోవడం, నిర్మాణ అనుమతుల వివరాలను వెల్లడించకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? అనుమతులు లేకుండానే పనులు కొనసాగుతున్నాయా? ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతుంటే ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు అధికారులు తక్షణమే స్పందించి, వాస్తవాలను నిర్ధారించాల్సి ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ నిర్మాణంపై అధికారులు స్పందించకపోవడంతో ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయని చెబుతున్నారు. నిర్మాణదారుల విషయంలో అధికారులు ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారో స్పష్టం చేయాలని కోరుతున్నారు.

**ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలి**

ఈ వ్యవహారంపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని, కేఎల్ఆర్ వెంచర్‌లో జరుగుతున్న నిర్మాణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, భవన నిర్మాణ ప్రణాళిక, సంబంధిత నిబంధనలను పరిశీలించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరుతున్నారు. నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు నిర్ధారణ అయితే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, నిబంధనల ప్రకారం అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలను ఉపేక్షిస్తే భవిష్యత్తులో మరిన్ని ఉల్లంఘనలకు అవకాశం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు మౌనం వీడి ఈ నిర్మాణంపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలని స్థానికులు కోరుతున్నారు. సామాన్యులకు వర్తించే నిబంధనలు భారీ నిర్మాణాలు చేపట్టేవారికీ సమానంగా అమలు చేయాలని, ప్రజల ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిమాండ్ చేస్తున్నారు. మరి అధికారులు స్పందిస్తారా? నిర్మాణ అనుమతులపై స్పష్టత ఇస్తారా? నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నట్లు తేలితే చర్యలు తీసుకుంటారా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

## మేడ్చల్ శ్రీ గడి మైసమ్మ ఆలయంలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

### ఎనిమిదవ రోజు శ్రీ భవానీ దేవి అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు

మేడ్చల్ నేటి దిన పత్రిక:- దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు మేడ్చల్ పట్టణంలోని శ్రీ గడి మైసమ్మ తల్లి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు అమ్మవారు శ్రీ భవానీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి తరలివస్తున్నారు. శరన్నవరాత్రుల సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహిస్తూ భక్తులు తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. అమ్మవారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకొని భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతున్నారు. ఆలయ పరిసరాలు భక్తి వాతావరణంతో సందడిగా మారుతున్నాయి. శ్రీ భవానీ దేవి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థిస్తున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపుతూ వైభవంగా కొనసాగుతున్నాయి.



## దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న బండి రమేష్



**కూకట్‌పల్లి/నేటి ప్రస్థానం /అక్టోబర్ 18 :** తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో దుర్గామాత మండపాలను సందర్శించారు.

**మూసాపేట్ డివిజన్:** శ్రీ నల్ల పోచమ్మ దేవాలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ రాచమల్ల బిక్షపతి గౌడ్, ఆర్. శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. అంబేద్కర్ నగర్ లో శివ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని సందర్శించి పూజలు చేశారు.

**కైతలాపూర్ డివిజన్:** ప్రగతి నగర్ లో జిట్టా సునీల్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని సందర్శించి, అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ఆంజనేయ నగర్:** శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని, శ్రీ సీతారామ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, పటోళ్ల నాగిరెడ్డి, మాజీ కౌన్సిలర్ తూము ఎల్లారావు, కర్క పెంటయ్య, తూము మనోజ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు తూము సంతోష్, కాలికోట శంకర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సలీం, మైనారిటీ అధ్యక్షులు ఎండీ చున్ను పాషా, నాయకులు కాస నర్సింహా యాదవ్, భాశెట్టి ప్రభాకర్, సప్పిడి భాస్కర్, కాలికోట బాలరాజ్, ఎండీ నయీమ్, తూము సచిన్, కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు, నల్ల పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు, ప్రగతి నగర్, ఆంజనేయ నగర్ కాలనీ అసోసియేషన్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# టీవీఎస్‌లో ఆస్తుల పంచాయితీ..

న్యూఢిల్లీ, అక్టోబర్ 13: యాజమాన్య హక్కులు, వ్యాపార ఆస్తుల విభజన లెక్కలు ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయని శ్రీనివాసన్ భార్య మల్లికా శ్రీనివాసన్, కూతురు లక్ష్మీ వేణు చెప్తున్నారు. ఈ మేరకు తాజాగా విడుదలైన ఓ సంయుక్త ప్రకటనలో ఆ ఇరువురు స్పష్టం చేశారు. కుటుంబ విభేదాల పరిష్కారానికి ఎలాంటి ఫైనాన్షియల్ సెటిల్మెంట్ జరుగలేదని పేర్కొన్నారు. 'ఈ వివాదం టీవీఎస్ గ్రూపునకు చెందిన ఆయా కంపెనీల్లో హోదాలకు సంబంధించి కాదు. యాజమాన్య హక్కులు, న్యాయబద్ధమైన వారసత్వ గుర్తింపునకు సంబంధించినది' అన్నారు. అలాగే పారదర్శకంగా ఈ ప్రక్రియ జరుగడం లేదని ఆరోపించారు. టీవీఎస్ మోటర్ కంపెనీ, దాని హోల్డింగ్స్ సంస్థలో వారసత్వం అంశాలపై కుటుంబంలో అభిప్రాయ భేదాలున్నాయన్న వార్తల నడుమ మల్లిక, లక్ష్మీ ప్రకటన మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నదిప్పుడు. టీవీఎస్‌లో ఆస్తుల గొడవ.. వేణు శ్రీనివాసన్, ఆయన భార్య మల్లికా శ్రీనివాసన్, కూతురు లక్ష్మీ వేణు, కుమారుడు సుదర్శన్ వేణుల మధ్యే జరుగుతున్నది. ఈ వ్యవహారంలో తండ్రీకొడుకులు ఒక గ్రూపైతే.. తల్లీకూతుళ్లు మరొక గ్రూప్. ఇక అసలు ఈ లొల్లికి కేంద్ర బిందువులు.. 2020 డిసెంబర్‌లో జరిగిన కుటుంబ ఒప్పందం, 2024 మార్చిలో చేసుకున్న అవగాహన ఒప్పందాలు (ఎంవోయూ). అవును.. ఈ అగ్రిమెంట్లు కేవలం వ్యాపార నిర్వహణ కోసమేనని లక్ష్మీ వేణు అంటుండగా, కాదు.. ఆస్తుల యాజమాన్య బదిలీకి సంబంధినవి అని సుదర్శన్ వేణు అంటున్నారు. దీంతో ఇప్పుడు లక్ష్మీ వేణు కోర్టులకెక్కే ఆలోచనల్నీ చేస్తుండటం గమనార్హం. అయితే కంపెనీ చట్టాలు కూడా ఈ వ్యవహారంలో కీలకం కానున్నాయి. ఇక ఇప్పటికే సీనియర్ న్యాయవాదుల సమక్షంలో ఇరువర్గాలు భేటీ కూడా అయ్యాయి.

**ఇదీ సంగతి..**

వేణు శ్రీనివాసన్ వర్గం.. సదరు ఒప్పందాలు టీవీఎస్ హోల్డింగ్స్, టీవీఎస్ మోటర్ కంపెనీ యాజమాన్య హక్కులు సుదర్శన్‌కు వర్తిస్తాయని స్పష్టం చేస్తున్నట్టు




చెప్తున్నది. అలాగే లక్ష్మీ వేణుకు సుందరం క్లేటన్, గ్రూప్‌నకు చెందిన చిన్న వ్యాపారాలు చెందుతాయని అంటున్నారు. అయితే లక్ష్మి ఈ వాదనను ఖండిస్తున్నారు. ఆ ఒప్పందాలు వ్యాపారపరమైన పాలనా విధుల కోసమేనని చెప్తున్నారు. యాజమాన్య హక్కుల బదిలీకి సంబంధించి నియమావళిని సూచించలేదని అంటున్నారు. కాగా, 2020 డిసెంబర్‌లో జరిగిన తొలి ఒప్పందంలో టీవీఎస్ వ్యవస్థాపకుడైన టీవీ సుందరం అయ్యంగార్ వారసులు రాజం, కృష్ణా, సంతానం, శ్రీనివాసన్, దొరైస్వామి శాఖల మధ్య నోటి మాట మీద కుదిరిన అవగాహనే. ఇది కుటుంబ శాఖల మధ్య నియంత్రణను పునర్వ్యవస్థీకరించడం, సంబంధిత వ్యాపార యాజమాన్యాల నిర్వహణను సమన్వయపర్చడం కోసమేనని చెప్తున్నారు. అయితే 2024 మార్చిలో కుదిరిన ఎంవోయూపై వేణు, మల్లిక, లక్ష్మి, సుదర్శన్ అంతా సంతకాలు చేశారు.

ఇందులో టీవీఎస్ బ్రాండ్ వినియోగం, ఇతరత్రా అంశాలున్నాయి. అయినప్పటికీ టీవీఎస్ హోల్డింగ్స్ ఇందులో భాగం కాలేదు. కానీ 2025 ఏప్రిల్‌లో వేణు శ్రీనివాసన్.. టీవీఎస్ హోల్డింగ్స్‌లో ఉన్న 6.79 శాతం వాటాను వీఎస్ ట్రస్ట్‌కు బదిలీ చేసినట్టు స్టాక్ ఎక్స్ఛేంజీల వివరాలు చెప్తున్నాయి. అలాగే వీఎస్ ట్రస్ట్, శ్రీనివాసన్ ట్రస్ట్ రెండింటి ద్వారా టీవీఎస్ హోల్డింగ్స్‌లో బెనిఫీషియల్ ఓనర్‌గా సుదర్శన్ వేణును తదనంతర ఫైలింగ్‌లు ప్రకటించాయి. ఈ నేపథ్యంలోనే కుటుంబ సభ్యుల నడుమ ఆస్తుల పంచాయతీ తారస్థాయికి చేరుకున్నది. టీవీఎస్ గ్రూప్‌ను 1911లో టీవీ సుందరం అయ్యంగార్ ప్రారంభించారు. టీవీఎస్ మోటర్ కంపెనీలో టీవీఎస్ హోల్డింగ్స్‌కు 50.26 శాతం వాటా ఉన్నది. ప్రస్తుతం టీవీఎస్ మోటర్ కంపెనీ ఎండీగా సుదర్శన్ వేణు ఉన్నారు. అలాగే టీవీఎస్ హోల్డింగ్స్‌కు లక్ష్మీ వేణు ఎండీగా వ్యవహరిస్తున్నారు.



# ఒప్పో ఎఫ్ సిరీస్ స్మార్ట్‌ఫోన్లు

హైదరాబాద్, అక్టోబర్ 13: వీటిలో ఎఫ్35 సిరీస్ స్మార్ట్‌ఫోన్లలో 6జీం128 జీబీ రకం ధర రూ.45,999గాను, 8జీబీం128 జీబీ మాడల్ రూ.49,999గాను, 8జీబీం256 జీబీ మాడల్ రూ.54,999కి విక్రయించనున్నది. అలాగే, ఒప్పో ఎఫ్35 ప్రొ 5జీ రకాల్లో 6జీం128 జీబీ మాడ్ రూ.38,999, 8జీబీం128 జీబీ మాడ్ రూ.42,999గా నిర్ణయించింది. ఈ ఎఫ్ సిరీస్ స్మార్ట్‌ఫోన్లు దేశవ్యాప్తంగా ఉన్న పలు రిటైల్ అవుట్‌లెట్లతోపాటు ఒప్పో ఇండియా ఈ-స్టోర్, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌లలో కూడా లభించనున్నాయని పేర్కొన్నది. ఈ ఫోన్లపై 10 శాతం ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్, నో-కాస్ట్ ఈఎంఐ, 10 శాతం వరకు ఎక్స్ఛేంజ్ బోనస్, జీరో డౌన్‌పేమెంట్ స్కీంలో కూడా ఈ ఫోన్లను కొనుగోలు చేయవచ్చునని తెలిపింది.

# ఐడీబీఐ బ్యాంకులో వాటాల విక్రయం.. కేంద్రం షేర్ కెనడా కంపెనీ చేతికి!




ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణ దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. బ్యాంకులో 60.72 శాతం వాటాను రూ.52,878 కోట్లకు కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ అనుబంధ సంస్థ '10955230 కెనడా ఇంక్'కు విక్రయించేందుకు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. ఈ ఒప్పందం పూర్తయితే ఎయిరిండియా విక్రయం తర్వాత దేశంలోనే అతిపెద్ద వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణగా నిలవనుంది. ఐడీబీఐ బ్యాంకులో కేంద్ర ప్రభుత్వానికి ఉన్న 30.48 శాతం వాటా, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ)కి ఉన్న 30.24 శాతం వాటా కలిపి మొత్తం 60.72 శాతాన్ని ఫెయిర్‌ఫాక్స్ కొనుగోలు చేయనుంది. ఒక్కో షేరుకు రూ.81 చొప్పున ఈ బిడ్ దక్కించుకుంది. మొత్తం కొనుగోలు విలువ రూ.52,877.07 కోట్లుగా ప్రభుత్వం అధికారిక ప్రకటనలో వెల్లడించింది. ఈ ఒప్పందం పూర్తయితే భారత ఆర్థిక రంగంలో ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ)గా నిలుస్తుందని కేంద్రం పేర్కొంది. ఐడీబీఐ బ్యాంకులో యాజమాన్య నియంత్రణను ప్రైవేటు సంస్థకు బదిలీ చేయాలన్న కేంద్ర ప్రభుత్వ దీర్ఘకాలిక ప్రణాళిక ఈ నిర్ణయంతో ముందుకు సాగనుంది. అయితే, ఈ లావాదేవీ పూర్తవడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అనుమతి కీలకం కానుంది. బ్యాంకును సొంతం చేసుకుని నిర్వహించేందుకు ఫెయిర్‌ఫాక్స్ అర్హతలను ఆర్‌బీఐ పరిశీలించనుంది. ఇందులో భాగంగా సంస్థపై 'ఫిట్ అండ్ ప్రాపర్' అంచనా వేయనుంది. ఫెయిర్‌ఫాక్స్‌కు ఇప్పటికే సీఎస్‌బీ బ్యాంకులో వాటా ఉంది. నిబంధనల ప్రకారం ఐడీబీఐ బ్యాంకు కొనుగోలు పూర్తయిన రెండేళ్లలోగా సీఎస్‌బీ బ్యాంకును ఐడీబీఐలో విలీనం చేయాలి లేదా సీఎస్‌బీ బ్యాంకులో తన వాటాను విక్రయించి బయటకు రావాలి. అలాగే ఐడీబీఐ బ్యాంకులోని మైనారిటీ వాటాదారుల కోసం ఫెయిర్‌ఫాక్స్ ఓపెన్ ఆఫర్ కూడా ప్రకటించాల్సి ఉంటుంది.

# జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ తేదీలు ఖరారు.. అక్టోబర్ 21 నుంచి ప్రారంభం

దేశీయ టెలికాం, డిజిటల్ రంగంలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ (ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్) తేదీలు ఖరారయ్యాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ డిజిటల్ అనుబంధ సంస్థ అయిన జియో ప్లాట్‌ఫామ్స్ ఈ మేరకు కీలక ప్రకటన చేసింది. భారత స్టాక్ మార్కెట్ చరిత్రలో ఇది ఒక కీలక ఐపీఓగా నిలవనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. కంపెనీ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ అక్టోబర్ 21న ప్రారంభమై అక్టోబర్ 23న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్ల కోసం బిడ్డింగ్ విండోను అక్టోబర్ 19న తెరవనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రాథమిక పత్రాలను ఇప్పటికే రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్ఓసీ) వద్ద దాఖలు చేసినట్లు కంపెనీ తెలిపింది. ఈ ఐపీఓ ద్వారా మొత్తం 27 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. ఇది 100 శాతం ఫ్రెష్ ఇష్యూ. అంటే ఈ ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులన్నీ కంపెనీ వ్యాపార విస్తరణ, ఇతర అవసరాలకే వినియోగిస్తారు. కంపెనీలోని ప్రస్తుత వాటాదారులు ఎవరూ తమ షేర్లను అమ్మడం లేదు. ఈ ఐపీఓలో రిలయన్స్ ఉద్యోగులకు, మాతృ సంస్థ అయిన రిలయన్స్ ఇండస్ట్రీస్ వాటాదారులకు ప్రత్యేక కోటాను కేటాయించారు. ఉద్యోగుల కోసం రూ. 500 కోట్ల విలువైన షేర్లను, రిలయన్స్ ఇండస్ట్రీస్ వాటాదారుల కోసం రూ. 2,500 కోట్ల విలువైన షేర్లను రిజర్వ్ చేసినట్లు కంపెనీ తన ప్రాస్పెక్టస్‌లో పేర్కొంది. జియో ప్లాట్‌ఫామ్స్ పనితీరు, భవిష్యత్ ప్రణాళికల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఈ ఐపీఓ కోసం ఎంతో కాలంగా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




# ముడి ధరలకు మళ్లీ రెక్కలు.. భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయా..?




మరోసారి చమురు ధరలు భయపెడుతున్నాయి.. పశ్చిమ ఆసియాలో తీవ్రతరం అవుతున్న దాడులు అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌లో ఆందోళనలను పెంచుతున్నాయి. సౌదీ అరేబియాలోని ఇంధన వనరులపై దాడుల ముప్పు, హార్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణాపై నెలకొన్న అనిశ్చితి.. ముడి చమురు ధరలపై ప్రభావం చూపుతున్నాయి. అక్టోబర్ 14న బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు 106.58 డాలర్ల వద్ద, అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) క్రూడ్ 94.94 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి.. దీంతో, ఆందోళన మొదలైంది..

**సౌదీ అరేబియాలో దాడుల ముప్పుతో పెరుగుతున్న ఆందోళనలు**

యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియా చమురు సంస్థలను లక్ష్యంగా చేసుకున్నారన్న నివేదికలు ఇంధన మార్కెట్‌ను కలవరపెడుతున్నాయి. అక్టోబర్ 13న సౌదీ అరేబియాలోని ధహ్రాన్‌లో ప్రభుత్వ యాజమాన్యంలోని చమురు, సహజ వాయువు సంస్థ సౌదీ అరామ్కోకు చెందిన పరిపాలనా భవనంపై అనుమానిత దాడి జరగడంతో స్వల్ప అగ్నిప్రమాదం సంభవించినట్లుగా తెలుస్తోంది.. ప్రపంచంలోని ప్రధాన చమురు ఉత్పత్తిదారుల్లో సౌదీ అరేబియా ఒకటి. ఆ దేశంలోని చమురు ఉత్పత్తి, నిల్వ, ఎగుమతి మౌలిక సదుపాయాలకు అంతరాయం కలిగితే అంతర్జాతీయ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. వాస్తవంగా సరఫరా తగ్గకపోయినా, భవిష్యత్తులో ఉత్పత్తి లేదా ఎగుమతులు నిలిచిపోవచ్చనే భయాలు ధరల పెరుగుదలకు కారణమవుతాయి. అందుకే మార్కెట్‌లో వ్యాపారులు భౌగోళిక రాజకీయ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారు.

ప్రపంచ చమురు రవాణాలో హార్మూజ్ జలసంధి అత్యంత కీలకమైన సముద్ర మార్గం. ఈ మార్గం ద్వారా జరిగే చమురు రవాణాకు ఆటంకాలు ఏర్పడితే అంతర్జాతీయ సరఫరా వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతుంది. నౌకలపై దాడులు, ట్యాంకర్ల రాకపోకలపై అనిశ్చితి, సముద్ర మార్గాల భద్రతపై ఆందోళనలు ఇప్పటికే మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయి. ఈ నెల ప్రారంభంలో ట్యాంకర్లపై జరిగిన దాడుల కారణంగా ఈ మార్గంలో చమురు రవాణా ప్రభావితమైనట్లు రాయిటర్స్ నివేదించింది. హార్మూజ్ మార్గంలో ఉద్రిక్తతలు మరింత పెరిగితే చమురు రవాణాలో జాప్యం జరగవచ్చు. అంతేకాకుండా నౌకల బీమా, రవాణా ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. ఈ అదనపు వ్యయాలు కొనుగోలుదారులపై భారం మోపి, అంతర్జాతీయ చమురు ధరలను మరింత పెంచవచ్చు. ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలు ఏ దిశగా వెళ్తాయనేది ఇతర ఉత్పత్తిదారుల నుంచి అందుబాటులోకి వచ్చే అదనపు సరఫరాలపై కూడా ఆధారపడి ఉంటుంది. రష్యా నుంచి డీజిల్ ఎగుమతులు పెరిగే అవకాశం ఇంధన మార్కెట్‌కు కొంత ఉపశమనం కలిగించవచ్చు. అయితే, డీజిల్ సరఫరా పెరగడం వల్ల పశ్చిమ ఆసియాలో ముడి చమురు సరఫరాకు సంబంధించిన ఆందోళనలు పూర్తిగా తొలగిపోతాయని చెప్పలేం. చమురు ఉత్పత్తి కొనసాగుతున్నప్పటికీ, భద్రతాపరమైన సమస్యల కారణంగా నౌకల ద్వారా రవాణా జరగకపోతే వినియోగదారులకు అందుబాటులో ఉండే సరఫరా తగ్గవచ్చు. అందువల్ల మార్కెట్ వర్గాలు ఉత్పత్తి గణాంకాలతో పాటు సముద్ర మార్గాల పరిస్థితి, ఎగుమతుల్లో అంతరాయాలు, అదనపు సరఫరాల లభ్యతపై దృష్టి సారిస్తున్నాయి.

**భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయా?**

భారతదేశం తన ఇంధన అవసరాల కోసం దిగుమతి చేసుకునే ముడి చమురుపై గణనీయంగా ఆధారపడుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు ఎక్కువ కాలం పాటు అధిక స్థాయిలో కొనసాగితే దేశ చమురు దిగుమతి బిల్లు పెరిగే అవకాశం ఉంది. అయితే, అంతర్జాతీయ ధరలు పెరిగినంత మాత్రాన దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే పెరుగుతాయని చెప్పలేం. దేశీయ ఇంధన ధరలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులు, చమురు మార్కెటింగ్ కంపెనీల నిర్ణయాలు, ముడి చమురు కొనుగోలు ఖర్చులు తదితర అంశాలు ప్రభావం చూపుతాయి. అంతర్జాతీయ ధరలు ఎక్కువ కాలం అధికంగా ఉంటే చమురు కంపెనీల వ్యయాలు పెరిగే అవకాశం ఉంది. రవాణా ఖర్చులు పెరిగితే సరుకుల పంపిణీ, తయారీ రంగాలపై కూడా ప్రభావం పడవచ్చు. తద్వారా నిత్యావసర వస్తువులు, ఇతర సేవల ధరలపై ఒత్తిడి ఏర్పడే ప్రమాదం ఉంది.

**రూపాయిపై ఒత్తిడి.. ద్రవ్యోల్బణ భయాలు**

ముడి చమురు ధరల పెరుగుదల భారతదేశ వాణిజ్య సమతుల్యతపైనా ప్రభావం చూపవచ్చు. చమురు దిగుమతుల కోసం ఎక్కువ డాలర్లు చెల్లించాల్సి వస్తే విదేశీ కరెన్సీకి డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. ఇది రూపాయిపై ఒత్తిడిని పెంచవచ్చు. అయితే, రూపాయి మారకం విలువపై ఇతర అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలు కూడా ప్రభావం చూపుతాయి. అధిక చమురు ధరలు రవాణా, ఉత్పత్తి వ్యయాలను పెంచి ద్రవ్యోల్బణ అంచనాలపై ప్రభావం చూపవచ్చు. అయితే, వాస్తవ ప్రభావం చమురు ధరలు ఎంత పెరుగుతాయి, ఎంతకాలం అధిక స్థాయిలో కొనసాగుతాయి అనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌లో సౌదీ అరేబియా ఇంధన మౌలిక సదుపాయాల భద్రత, పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఘర్షణలు, హార్మూజ్ జలసంధి ద్వారా ట్యాంకర్ల రాకపోకలు, ఇతర దేశాల నుంచి అదనపు సరఫరాలపై ప్రధానంగా దృష్టి ఉంది. ఈ పరిణామాలు మరింత తీవ్రమైతే ముడి చమురు ధరలు పెరిగే అవకాశం ఉంది. ఉద్రిక్తతలు తగ్గి సరఫరా వ్యవస్థ సాధారణ స్థితికి వస్తే మార్కెట్‌కు కొంత ఉపశమనం లభించవచ్చు. మొత్తంగా, అంతర్జాతీయ చమురు ధరల పెరుగుదల భారత్ దిగుమతి ఖర్చులు, ఇంధన రంగం, రవాణా వ్యయాలు, ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే, పెట్రోల్, డీజిల్ ధరలు, రూపాయి మారకం విలువలో ఎలాంటి మార్పులు వస్తాయనేది రాబోయే రోజుల్లో అంతర్జాతీయ పరిణామాలు, దేశీయ విధానాలపై ఆధారపడి ఉంటుందని చెప్పాలి..

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక



# బాలీవుడ్ ఇండస్ట్రీలో 'హిందూ ఫోబియా' ఉంది: ఏక్తా కపూర్

ప్రముఖ బాలీవుడ్ నిర్మాత ఏక్తా కపూర్ సినీ పరిశ్రమపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బాలీవుడ్ ఇండస్ట్రీలో 'హిందూ ఫోబియా' (హిందూ వ్యతిరేకత) బలంగా పాతుకుపోయిందని ఆమె ఆరోపించారు. ఇటీవల తన కొత్త చిత్రం 'ది వాన్' ప్రమోషన్‌లో భాగంగా రణ్‌వీర్ అలహాబాదియా పాడ్‌కాస్ట్‌లో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. పాశ్చాత్య ఫాంటసీ, యానిమేషన్ చిత్రాలను పరిశ్రమ తేలికగా అంగీకరిస్తుందని, కానీ భారతీయ జానపద కథలు, పురాణాలు, సంస్కృతి ఆధారంగా సినిమాలు తీస్తే మాత్రం అసౌకర్యంగా ఫీలవుతుందని ఏక్తా కపూర్ అన్నారు. తన కెరీర్ ప్రారంభంలో నుదుట బొట్టు, చేతికి ధాగా (దారం) కట్టుకున్నందుకు తనను చాలామంది వింతగా చూశారని, 'తాంత్రికురాలు', 'ఫ్రీక్' అని పిలిచారని ఆమె గుర్తుచేసుకున్నారు. ఒకసారి గుడి నుంచి నేరుగా క్లబ్‌కు వెళ్లినప్పుడు కొందరు ఆశ్చర్యపోయారని, మత విశ్వాసాలు, ఆధునిక జీవనశైలి రెండూ కలిసుండకూడదా అని తాను ప్రశ్నించినట్లు ఏక్తా తెలిపారు. అయితే, ఇప్పుడు భారతీయ జానపద కథలకు ఆదరణ పెరగడం సంతోషంగా ఉందని ఆమె పేర్కొన్నారు.



# బెల్లంకొండ శ్రీనివాస్ మిస్టిక్ థ్రిల్లర్ 'హైందవ' టీజర్

ఈ ఏడాది పెళ్లి చేసుకున్న హీరో బెల్లంకొండ శ్రీనివాస్.. కాస్త గ్యాప్ తీసుకుని కొత్త సినిమాతో వచ్చేస్తున్నాడు. అదే 'హైందవ'. దేవుడి కాన్సెప్ట్‌కి థ్రిల్లర్ కథని జోడించి తీశారు. తాజాగా టీజర్ రిలీజ్ చేసిన టీమ్.. మూవీ విడుదల తేదీని కూడా వెల్లడించారు. సంయుక్త మేనన్ హీరోయిన్ కాగా లుధీర్ బైరెడ్డి దర్శకుడు. రంగాపురం అనే ఊరిలో ఉండే గుడిలో విగ్రహాలు కనిపించకుండాపోతాయి. మరోవైపు ఓ వ్యక్తి చనిపోతాడు. ఈ కేసుని దర్యాప్తు చేసేందుకు పోలీస్ అయిన హీరో వస్తాడు. దేవుడంటే పెద్దగా నమ్మకం లేని ఇతడు.. ఈ విగ్రహాలు మిస్సింగ్ కేసుని ఎలా డీల్ చేశాడు? ఈ క్రమంలో ఏం తెలుసుకున్నాడనేది స్టోరీలా అనిపిస్తుంది. వచ్చే నెల 27న మూవీని థియేటర్లలో రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించారు. టీజర్‌లోని విజువల్స్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ బాగున్నాయి. 'ఏం జరుగుతుందో చెప్పి, ఎలా జరుగుతుందో చూడమనే వాడే నయ్యా.. దేవుడంటే' డైలాగ్ కూడా ఆసక్తికరంగా అనిపించింది. మరి మూవీ ప్రేక్షకుల్ని ఏ మేరకు అలరిస్తుందో చూడాలి?



# షూటింగ్‌లో పెను ప్రమాదం నుంచి బయటపడ్డ ఇమ్రాన్ హష్మీ



బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ తృటిలో ఓ పెను ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఆయన నటిస్తున్న కొత్త చిత్రం 'గున్‌మాస్టర్ జీ9' షూటింగ్ సెట్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. బెంగళూరులో జరుగుతున్న క్లైమాక్స్ చిత్రీకరణలో భాగంగా ఓ కారు స్టంట్ చేస్తుండగా, సాంకేతిక లోపంతో అది ఒక్కసారిగా కిందపడిపోయింది. ఇమ్రాన్ హష్మీకి కేవలం అడుగు దూరంలోనే కారు కూలిపోవడంతో సెట్‌లో అందరూ ఉలిక్కిపడ్డారు. వివరాల్లోకి వెళ్తే, 'గున్‌మాస్టర్ జీ9' సినిమా క్లైమాక్స్‌లో భాగంగా ఓ భారీ యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నారు. ఇందులో భాగంగా ఓ కారును గాల్లోకి లేపి ఫ్లిప్ చేసే స్టంట్ ప్లాన్ చేశారు. అయితే, ఊహించని విధంగా సాంకేతిక సమస్య తలెత్తడంతో కారును పట్టి ఉంచిన మెకానిజం విఫలమైంది. దీంతో గాల్లో ఉన్న కారు వేగంగా కిందకు పడిపోయింది. ఈ ఘటనలో ఇమ్రాన్ హష్మీకి ఎలాంటి గాయాలు కాలేదని, ఆయన క్షేమంగా ఉన్నారని ఆయన ప్రతినిధి ధృవీకరించారు. ఈ ప్రమాదంతో షూటింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు.

# 76 ఏళ్ల వయసులోనూ తగ్గని మ్యాజిక్..

సూపర్‌స్టార్ రజనీకాంత్.. ఐదు దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తున్న పేరు. వయసు పెరుగుతున్నా ఆయన తెరపై చూపించే మ్యాజిక్ ఏమాత్రం తగ్గడం లేదు. ఈ విషయాన్నే ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ మరోసారి గుర్తుచేశాడు. 76 ఏళ్ల వయసులోనూ రజనీ చరిత్రను తిరగరాస్తున్నారని ప్రశంసించాడు. ఆయన నటించిన 'జైలర్ 2' విడుదలకు ముందు అనిరుధ్ చేసిన వ్యాఖ్యలు అభిమానుల్లో ఆసక్తి పెంచుతున్నాయి. 'జైలర్ 2'పై అనిరుధ్ సోషల్ మీడియా వేదికగా స్పందించాడు. తరతరాలుగా రజనీకాంత్ ప్రేక్షకులకు ఆనందం, నవ్వులు, ఉత్కంఠతో పాటు జీవితాంతం గుర్తుండిపోయే అనుభూతులను అందించారని పేర్కొన్నాడు. 51 ఏళ్ల సినీ ప్రయాణంలోనూ ఆయన కొత్త చరిత్ర సృష్టిస్తూనే ఉన్నారని కొనియాడాడు. గురువారం 'జైలర్ 2' విడుదల సందర్భంగా మరోసారి ప్రపంచమంతా రజనీపై అభిమానాన్ని చూడబోతోందని అనిరుధ్ అన్నాడు. ప్రతి భారతీయుడి హృదయంలో ఆయనకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నాడు. 'ఒకే సూర్యుడు.. ఒకే చంద్రుడు.. ఒకే రజనీ' అంటూ తన పోస్టులో అభిమానాన్ని చాటుకున్నాడు. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన 'జైలర్ 2'కు సెన్సార్ బోర్డు యూ/ఏ సర్టిఫికెట్ ఇచ్చింది. సన్ పిక్చర్స్ ఈ విషయాన్ని సోషల్ మీడియాలో వెల్లడించింది. అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానుంది. ఇటీవల విడుదలైన ట్రైలర్‌లో టైగర్ ముత్తువేల్ పాండియన్ పాత్రలో రజనీకాంత్ కనిపించారు. ఆయన ఆచూకీ కోసం విలన్లు వెతుకుతుంటారు. అయితే శత్రువుల వ్యవస్థలో పైస్థాయిలో ఎవరున్నారో తెలుసుకునేందుకు రజనీ డ్రైవర్ వేషంలో అజ్ఞాతంలోకి వెళ్లినట్లు ట్రైలర్ సూచిస్తోంది. ఎస్.జె.సూర్య కీలక పాత్రలో కనిపించగా.. విద్యాబాలన్‌తో రజనీ సంభాషణలు కూడా ఆకట్టుకుంటున్నాయి. దీంతో సినిమాపై అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి.





# అభిమానుల ప్రేమకు రష్మిక బహుమతి..

## 400 కుటుంబాలకు సాయం

నటి రష్మిక మందన్న మరోసారి తన మంచి మనసును చాటుకున్నారు. ఆపదలో ఉన్న 400 కుటుంబాలకు అండగా నిలిచేందుకు ముందుకొచ్చారు. మూడు నెలల పాటు ఆ కుటుంబాల నిత్యావసర సరుకుల ఖర్చును భరించనున్నట్లు ప్రకటించారు. తనలోని ఈ సేవాభావానికి 'రణబాలి' సినిమాలోని జయమ్మ పాత్రే స్ఫూర్తి అని వెల్లడించారు. ఇప్పటివరకు తాను చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి బయటకు చెప్పలేదని రష్మిక తెలిపారు. అయితే తనను చూసి మరికొందరైనా సాయం చేసేందుకు ముందుకొస్తారనే ఉద్దేశంతో ఈ విషయాన్ని పంచుకున్నట్లు వివరించారు. ఒక్కోసారి 400 కుటుంబాలకు మూడు నెలల పాటు సాయం అందించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని వచ్చే ఏడాది పాటు కొనసాగిస్తానని వెల్లడించారు. నిత్యావసర సరకుల కోసం ఖర్చు చేసే డబ్బు ఆదా అయితే, కుటుంబాలు తమ భవిష్యత్తు కోసం ప్రణాళికలు వేసుకోవచ్చని రష్మిక ఆశాభావం వ్యక్తం చేశారు. చిన్న సాయం కూడా ఒకరి జీవితంలో మార్పు తీసుకురాగలదని పేర్కొన్నారు. పెద్ద మొత్తంలో సాయం చేయాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరూ తమకు వీలైనంతలో చిన్న అడుగుతో ప్రారంభించాలని పిలుపునిచ్చారు. తాను పోషించే పాత్రలు తనపై ప్రభావం చూపుతుంటాయని రష్మిక చెప్పారు. 'రణబాలి'లో జయమ్మ పాత్రకు, తన నిజ జీవిత వ్యక్తిత్వానికి చాలా పోలికలు ఉన్నాయని తెలిపారు. అందులో ఈ సేవాభావం కూడా ఒకటని వివరించారు. అభిమానులు తనపై చూపిస్తున్న ప్రేమకు ప్రతిగా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తానని పేర్కొన్నారు.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAl, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/